

RNI NO:TELTEL/ 2023/89546

సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 281 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 7 జనవరి 2025 | వెల : 4/-



## కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది

- గ్రీన్‌కో 2022లో ఎన్నికల బాండ్లు ఇచ్చింది
- 2023లో ఫార్ములా ఈ రేసు జరిగింది.
- కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చింది
- ఫార్ములా ఈ రేసు కారణంగా గ్రీన్ కో నష్టపోయింది
- అందుకే మరుసటి ఏడాది స్పాన్సర్‌షిఫ్ నుంచి తప్పుకుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గ్రీన్‌కో 2022లో - మిగతా3లో

### పేద, మధ్య తరగతి ప్రజలకు

# తీపికబురు!

- రేషన్ కార్డుకోసం దరఖాస్తుచేసుకున్న వారి వివరాలు పరిశీలించిన ప్రభుత్వం..
- వీరికి కొత్త రేషన్ కార్డులను జనవరి 26న అందించనుంది
- అర్హులు సైతం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు
- ఈనెల15వ తేదీ నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించే అవకాశం
- రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులను ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేయాలనే ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం





హైదరాబాద్

పేద, మధ్య తరగతి ప్రజలు ఏవైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పొందాలంటే ఇప్పటివరకు కొలబద్ద రేషన్ కార్డు. అందుకే ప్రతి సామాన్య కుటుంబం రేషన్ కార్డు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. ప్రతినెలా తీసుకునే రేషన్ కంటే ప్రభుత్వం అందించే ఇతర సంక్షేమ పథకాలకు ప్రభుత్వాలు రేషన్‌కార్డు తప్పనిసరి నిబంధన పెట్టడంతో ఆ కార్డుకు ఎక్కువ డిమాండ్ ఉంది. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు వస్తాయని ప్రజలు ఎదురుచూసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కొత్త రేషన్ కార్డుల జారీకి మంత్రిమండలి ఇటీవల ఆమోదం తెలపడంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జనంలో మళ్లీ ఆశలు - మిగతా3లో



## ప్రెస్‌మీట్‌లో కంటతడి పెట్టిన ఢిల్లీ సీఎం

- రాజకీయాలు ఇంతగా దిగజారిపోవడంపై ఆవేదన
- చేసిన పనుల ఆధారంగా ఓట్లు అడగొచ్చు
- కానీ మా తండ్రిగారిని అవమానించడం సరికాదు”
- ఎలక్షన్ల కోసమని తన తండ్రిపై ఆయన (బిధూరి) బురద చల్లుతారా?




## ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఎంపీవీ..

- దేశంలో మూడు హెచ్‌ఎంపీవీ కేసులు నమోదు
- బాంబ్ పేల్చిన ఐసీఎంఆర్
- హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ‘సర్క్యులేషన్’లో ఉంది
- శ్వాసకోశ వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉంది
- వైరస్ వ్యాప్తి పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి



- మోదీ ముందు చిట్టా విప్పిన రేవంత్...
- బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలి
- తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంది
- ఎలక్ట్రిక్ వేహికల్ తయారీకి అనుమతి ఇవ్వాలి
- రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోంది
- రీజనల్ రైల్ అవసరం కూడా ఉంది

హైదరాబాద్

చర్లపల్లి టెర్మినల్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని ప్రసంగించారు. రైల్వే టెర్మినల్ పూర్తి చేసినందుకు ప్రధానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా - మిగతా3లో




### ఎయిర్‌పోర్టును తలపించేలా

## చర్లపల్లి రైల్వే స్టేషన్

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఓఆర్ఆర్‌కు అత్యంత సమీపంలో చర్లపల్లి ఉంది
- తెలంగాణ ప్రగతిలో ఇది అత్యంత కీలకంగా మారబోతుంది
- సోలార్ స్టేషన్‌గా దీన్ని అభివృద్ధి చేశారు
- భారత రైల్వేలకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నాం
- కోట్లాది మందిని వందేభారత్ రైళ్లు గమ్యం చేరుస్తున్నాయి

హైదరాబాద్

సర్వ హంగులతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో అధునాతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చ్యువల్‌గా - మిగతా3లో




## డాకింగ్ టెస్ట్‌ను వాయిదా వేసిన ఇస్రో

- మళ్లీ నిర్వహించేది ఎప్పుడో తెలుసా..?
- షెడ్యూల్ ప్రకారం డాకింగ్ ప్రక్రియ ఈ నెల 7న జరగాల్సి ఉండగా.. 9వ తేదీకి వాయిదా
- తొలిసారిగా డాకింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నది.
- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ త్వరలో చంద్రయాన్-4 మిషన్‌కు సిద్ధమవుతుంది
- చంద్రుడిపై నమూనాలను సేకరించనున్నది


## కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు

- అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు
- సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తాం



## తెలంగాణ ఓటర్లు.. 3.35 కోట్లు

- సవరించిన జాబితా వెల్లడించిన ఈసీ
- తెలంగాణలో కొత్త ఓటరు జాబితాను విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- సవరించిన ఓటరు జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు
- 1,66,41,489 మంది పురుష... 1,68,67,735 మంది మహిళా ఓటర్లు
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది ఓటర్లు




హైదరాబాద్

తెలంగాణకు సంబంధించి సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,66,41,489 మంది పురుష ఓటర్లు, 1,68,67,735 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. అదేవిధంగా మరో 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కూడా రాష్ట్రంలో ఉన్నారు. ఈ మొత్తం ఓటర్లలో 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న ఓటర్లు 5,45,026 మంది కాగా, 85 ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్ల సంఖ్య 2,22,091 గా ఉన్నది. ఎన్ఆర్ఐ ఓటర్లు 3,591 మంది ఉన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన ఓటర్లు 5,26,993 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఇక - మిగతా3లో

# డాకింగ్ టెస్ట్‌ను వాయిదా వేసిన ఇస్రో

స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన డాకింగ్ టెస్ట్‌ను ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం డాకింగ్ ప్రక్రియ ఈ నెల 7న జరగాల్సి ఉండగా.. 9వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొంది. డాకింగ్ ప్రక్రియను వాయిదాకు గల కారణాలను వెల్లడించలేదు. కేంద్ర ఎర్త్ సైన్స్ మంత్రి జితేంద్ర సింగ్ స్పాడెక్స్ మిషన్‌కు ఇండియన్ డాకింగ్ టెక్నాలజీగా నామకరణం చేశారు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. తొలిసారిగా డాకింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నది. మిషన్‌లో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన ఉపగ్రహాలను భూమి తక్కువ కక్ష్యలో ఒకదానితో మరొకదాన్ని ఇస్రో అనుసంధించనున్నది. ఇప్పటి వరకు, రష్యా, అమెరికా, చైనాకు మాత్రమే క్లిష్టమైన ఈ సాంకేతిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నది.


ఇస్రో సైతం ఈ ఘనతను సాధించేందుకు రెడీ అవుతున్నది. ఇందులో ఇస్రో విజయవంతమైన డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనున్నది. ప్రక్రియలో భాగంగా దాదాపు గంటకు 28,800 కిలోమీట్ల వేగంతో ప్రయాణించే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను అనుసంధానం చేస్తారు. టెస్ట్‌లో సెన్సార్ సెట్‌ని ఉపయోగించి ఉపగ్రహాల వేగాన్ని తగ్గించి.. ఆ తర్వాత ఒకదానితో ఒకటి అనుసంధానిస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. భారతీయ డాకింగ్ మెకానిజంపై ఇస్రో ఇప్పటికే పేటెంట్ తీసుకుంది. డాకింగ్ అనేది సంక్లిష్టమై పక్రియ. ఎందుకంటే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను కక్ష్యలో ఉంచాలి. ముఖ్యంగా ఒకదానితో మరొకటి ఢీకొట్టకుండా చూడాల్సి ఉంటుంది.




భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ త్వరలో చంద్రయాన్-4 మిషన్‌కు సిద్ధమవుతుంది. చంద్రుడిపై నమూనాలను సేకరించనున్నది. ఈ మిషన్‌ను రెండు విడుతలుగా చేపట్టనున్నది. ఈ క్రమంలో డాకింగ్‌లో నైపుణ్యం సాధించడం తప్పనిసరని ఇస్రో చీఫ్ సోమనాథ్ వెల్లడించారు. ఇక స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా డిసెంబర్ 30న శ్రీహరికోటలోని లాంచ్‌ప్యాడ్ నుంచి పీఎస్ఎల్వీ సీ-60 వాహహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఎస్‌డీఎక్స్01(చేజర్), ఎస్‌డీఎక్స్02(టార్గెట్) అనే 440 కిలోలు ఉన్న రెండు చిన్న ఉపగ్రహాలను ఈ వాహకనౌక నిర్ణీత భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వీటిని భూమికి 470 కిలోమీటర్ల ఎత్తులో ఈ రెండింటినీ 3 మీటర్ల సమీపానికి చేర్చి డాకింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

# ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఎంపీవీ

**న్యూఢిల్లీ:** దేశంలో అత్యున్నత మెడికల్ బాడీ అయిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) బాంబు పేల్చింది. హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 'సర్క్యులేషన్'లో ఉందని హెచ్చరించింది. అయితే శ్వాసకోశ వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉందని తెలిపింది. దేశంలో మూడు హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, భారత్‌తో సహా అనేక దేశాల్లో హెచ్‌ఎంపీవీతో సంబంధం ఉన్న శ్వాసకోశ వ్యాధుల కేసులు నమోదైనట్లు ఐసీఎంఆర్ తెలిపింది. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్పీ) నెట్‌వర్క్, ఐసీఎంఆర్ డేటా ప్రకారం ఇన్‌ఫ్లూఎంజా లేదా తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్యంలో అసాధారణ కేసుల పెరుగుదల పరిస్థితి దేశంలో లేదని పేర్కొంది. ఈ వైరస్ వ్యాప్తి పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే హెచ్‌ఎంపీవీ వ్యాప్తి ట్రెండ్‌ను ఈ ఏడాది అంతా ఐసీఎంఆర్ ట్రాక్ చేస్తుందని వివరించింది.



### కర్ణాటకలో హెచ్‌ఎంపీవీ కేసులు.. అప్రమత్తమైన ఢిల్లీ ప్రభుత్వం

కర్ణాటక రాజధాని బెంగళూరులో, గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైన నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్‌ను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖలకు ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆదేశాలు జారీచేశారు. శ్వాసకోశ సంబంధ అనారోగ్యానికి దారితీసే ఈ వైరస్ విస్తృతమైతే తీసుకోవాల్సిన చర్యలపై అన్ని ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యమంత్రి భరద్వాజ్ సూచించారు. ఈ వైరస్ కట్టడికి సంబంధించిన చర్యలపై అప్‌డేట్స్ కోసం ఢిల్లీ ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ ఎప్పటికప్పుడు కేంద్ర ఆరోగ్య శాఖతో సంప్రతింపులు జరుపుతుండాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఏమాత్రం తాత్సారం చేయవద్దని హెచ్చరించారు. వైరస్‌కు సంబంధించి ఎలాంటి అప్‌డేట్స్ ఉన్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. వైరస్‌ను అడ్డుకునే ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు, సూచనలు కావాలన్నా తనను ఫోన్‌లో సంప్రదించాలని ఆదేశించారు. ప్రతిరోజు మూడు ఆస్పత్రులను తనిఖీ చేయాలని, సంబంధిత రిపోర్టులను ఎప్పటికప్పుడు తనకు పంపించాలని ఢిల్లీ ఆరోగ్య కార్యదర్శికి మంత్రి ఆదేశాలు జారీచేశారు.

### వైరస్ పట్ల అప్రమత్తం..

అయితే ప్రస్తుతం చైనాలో వ్యాపిస్తున్న హెచ్‌ఎంపీవీ.. అదే జాతి ఇదేనా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం కూడా హెచ్చరికలు జారీ చేసింది. హెచ్‌ఎంపీవీ.. కి సంబంధించి ఆరోగ్య శాఖ ఒక సలహా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనేది ఇప్పుడు తెలుసుకుందాం. ఈ క్రమంలో హెచ్‌ఎంపీవీ.. సంక్రమణ ఇప్పటికే భారతదేశంతో సహా అనేక దేశాలలో వ్యాపిస్తోందని, వివిధ దేశాలలో సంబంధిత శ్వాసకోశ వ్యాధుల కేసులు నమోదయ్యాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా వైరస్ వ్యాధిగ్రస్తుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

### హెచ్‌ఎంపీవీ.. వైరస్ విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు

1. తుమ్మేటప్పుడు, దగ్గుతున్నప్పుడు రుమాలు, గుడ్డ ఉపయోగించడం
2. దగ్గు, జలుబుతో బాధపడేవారు బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి
3. ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ ఉపయోగించండి
4. కరచాలనం చేయకూడదు
5. ఒకే రుమాలను అనేక మంది ఉపయోగించవద్దు
6. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం ఆపండి
7. ఇన్ఫెక్షన్ వస్తే సొంతంగా మందులు తీసుకోవాలి

# మహిళలకు రూ.2.500.. ప్రకటించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం "ప్యారీ దీదీ యోజన"ను ప్రకటించింది. ఈ స్కీమ్ కింద మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సాయం అందనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తామని వాగ్దానం చేసింది. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ పథకాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కర్ణాటక మోడల్ తరహాలోనే 'ప్యారీ దీదీ' పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేస్తామని, తొలి మంత్రివర్గ సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఖరారు చేస్తామని డీకే చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉండటంతో పార్టీలన్నీ ప్రధానంగా మహిళా పథకాలపై దృష్టి సారిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని సాధించింది. ఈ విజయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రి లడ్కీ బహిన్ యోజన' కీలక పాత్ర పోషించినట్టు రాజకీయ విశ్లేషకులు తేల్చిచెప్పారు.



### కాంగ్రెస్‌పై పెరుగుతున్న నమ్మకం


కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుండటంతో ప్రజల్లోనూ నమ్మకం పెరిగినట్టు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జారా?ండ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఏవైతే వాగ్దానాలు చేశామో వాటన్నింటిని అమలు చేశామని, ప్రజావిశ్వాసాన్ని పొందగలిగామని చెప్పారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కలల్లో విహరిస్తుంటారని, 11 ఏళ్లుగా ఢిల్లీ పరిస్థితి దిగజారిందని, ఎడ్యుకేషన్ మోడల్, ఉచిత విద్యుత్, ఉచిత నీళ్లు, అవినీతిని అంతం చేయడం వంటి హామీలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నాయి. ఢిల్లీలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు 60 సీట్లలో ఆప్ గెలుపొందగా, బీజేపీ 8 సీట్లు గెలుచుకుంది.

## మహాకుంభ్ ప్రయాగ్‌రాజ్ యుద్ధభూమిగా మారుతుంది.. ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ బెదిరింపులు

సిక్కు వేర్పాటువాద నాయకుడు, ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు. జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాను అడ్డుకుంటామని హెచ్చరించాడు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న ఈ మహాకుంభ మేళాపై దాడులు చేసి భగ్నం చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా 'చలో ప్రయాగ్‌రాజ్'కు పిలుపునిచ్చాడు. లఖ్‌నవూ, ప్రయాగ్‌రాజ్‌లోని విమానాశ్రయాల్లో ఖలిస్తానీ, కశ్మీరీ జెండాలను ఎగురవేయాలని ఆయన మద్దతుదారులను కోరాడు. 'మహాకుంభ ప్రయాగ్‌రాజ్ 2025 యుద్ధభూమిగా మారుతుంది' అంటూ తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు. కాగా, పన్నూన్ ఇలా బెదిరింపులకు పాల్పడటం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ అనేక సార్లు ఇలాంటి హెచ్చరికలే చేశాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని వాటిలో సిక్కులు ప్రయాణించొద్దని, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మూసివేస్తారని, అయోధ్య రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం వంటి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.



## లోయలో పడిన బస్సు.. నలుగురు మృతి, 32 మందికి గాయాలు



**తిరువనంతపురం:** బస్సు లోయలో పడిన దుర్ఘటనలో నలుగురు ప్రయాణికులు మరణించగా.. మరో32 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కేరళలోని కొటరక్కర-దిండిగల్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. అందులోభాగంగా క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వారిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బ్రేక్ ఫెయిల్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీస్ ఉన్నతాధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులోని తాంజావూర్ పర్యటనకు వెళ్లిన యాత్రికులు తిరిగి స్వస్థలం అలప్పుజా జిల్లాలోని మావెలిక్కరకు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ఇడుక్కి జిల్లాలోని కల్లివాయల్ ఎస్టేట్ సమీపంలో ఈ రోజు ఉదయం ఈ దుర్ఘటన చోటు చేసుకుందని వివరించారు. ఈ ప్రమాదంలో మరణించిన నలుగురు మృతులు.. అరుణా హరి (55), రామ్మోహన్ (40), సంగీత (45), బిందు ఉన్నితాన్ (59)గా గుర్తించామన్నారు. వీరంతా మావెలిక్కర వాసులను చెప్పారు. పర్వత ప్రాంతంలో మలుపు తిరిగే క్రమంలో బస్సు బ్రేకులు ఫెయిల్ అయి.. అదుపు తప్పి 70 అడుగుల లోతు ఉన్న భారీ లోయలోకి పడి పోయిందన్నారు. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన సిబ్బంది సహాయంతో.. సహాయక చర్యలు చేపట్టామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రమాదానికి గురైన బస్సు కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు అని వారు పేర్కొన్నారు.

## ప్రెస్‌మీట్‌లో కంటతడి పెట్టిన ఢిల్లీ సీఎం

**న్యూఢిల్లీ:** బీజేపీ నేత రమేష్ బిధూరి తనపై చేసిన వ్యాఖ్యలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంటతడి పెట్టారు. రాజకీయాలు ఇంతగా దిగజారిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అతిషి ఇంటిపేరుపై బిధూరి చేసిన వ్యాఖ్యలు వివాదం కావడంతో ఆమె మీడియా ముందుకు వచ్చారు.



"రాజకీయాలు ఎందుకు ఇంతలా దిగజారిపోయాయి? ఆయన (బిధూరి) పదేళ్లుగా కల్కాజీ నియోజకవర్గానికి చేసిన పనులు ఉంటే వాటి గురించి చెప్పుకోవచ్చు. చేసిన పనుల ఆధారంగా ఓట్లు అడగొచ్చు. కానీ మా తండ్రిగారిని అవమానించడం సరికాదు" అని అతిషి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి తన జీవితమంతా ఒక టీచర్‌గా పనిచేశారని, పేద, మధ్యతరగతికి చెందిన వేలాది మంది పిల్లలకు పాఠాలు చెప్పారని, ఇప్పుడు ఆయన వయస్సు 80 సంవత్సరాలని తెలిపారు. ఆయన నిజంగానే అస్వస్థతతో ఉన్నారని, ఎవరో ఒకరి సాయం లేకుండా నడవలేకపోతున్నారని చెప్పారు. ఎలక్షన్ల కోసమని తన తండ్రిపై ఆయన (బిధూరి) బురద చల్లుతారా? ఒక వృద్ధుడిపై నిందలు వేస్తారా? ఈ దేశ రాజకీయాలు ఇంతలా దిగజారిపోతాయని తాను ఎన్నడూ అనుకోలేదని అతిషి తెలిపారు.

### బిధూరి ఏమన్నారు?

అతిషి ఇంటిపేరు 'మార్లేనా' అని.. 'సింగ్'గా పేరు మార్చుకున్నారని రోహిణిలో జరిగిన బీజేపీ పరివర్తన ర్యాలీలో బిధూరి అన్నారు. కల్కాజీ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన అతిషి కొద్ది కాలం క్రితమే తన ఇంటిపేరును వదులుకున్నారని చెప్పారు. కల్గాజీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రమేష్ బిధూరి పోటీ చేస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య.. మందుపాతర పేలి ఎనిమిది మంది జవాన్లు మృతి



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జవాన్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే కూంబింగ్ తర్వాత తిరిగి వెళ్తున్న జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పేలుడు జరిగిన పరిసర ప్రాంతాల్లో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనను బస్తర్ రీజియన్ ఐజీ ధృవీకరించారు.

## ఢిల్లీ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసిన ఈసీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్ల తుది జాబితాను ఢిల్లీ ఎన్నికల కమిషన్ సోమవారంనాడు విడుదల చేసింది. అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం దేశ రాజధానిలో 1,55,24,858 మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 84,49,645 మంది పురుష ఓటర్లు, 71,73,952 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబిజాలో లేనివారు 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎంత మంది కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది పేర్లను తొలగించారనే వివరాలు తాజా ఓటర్ల తాబితాలో ఈసీ పొందుపరిచింది. కాగా, మాజీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ఓటర్లను తొలిగించారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలను న్యూఢిల్లీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ గత శనివారంనాడు తోసిపుచ్చారు.

# ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే స్టేషన్

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగిందని, రూ.413 కోట్ల వ్యయంతో చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఓఆర్‌ఆర్‌కు అత్యంత సమీపంలో చర్లపల్లి ఉందని, తెలంగాణ ప్రగతిలో ఇది అత్యంత కీలకంగా మారబోతోందని, సోలార్ స్టేషన్‌గా దీన్ని అభివృద్ధి చేశారని మోదీ వ్యాఖ్యానించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా.. చర్లపల్లి లాంటి స్టేషన్లు ఎంతో అవసరమని, 2014లో కేవలం 5 నగరాల్లోనే మెట్రో ఉందని, పదేళ్లలో 21 నగరాలకు మెట్రో విస్తరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

భారత రైల్వేలకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నామని, కోట్లాది మందిని వందేభారత్ రైళ్లు గమ్యం చేరుస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయిందని, వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చామని, హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోందన్నారు. 180 కి.మీ. వేగంతో వందేభారత్ స్లీపర్ కోచ్ రైలు ట్రయల్ రన్ పూర్తి అయిందన్నారు. త్వరలోనే బుల్లెట్ రైలు సాకారం అవుతుందని, పదేళ్లలో 30 వేల కి.మీ. రైల్వే లైన్లు నిర్మించామని అన్నారు. నాలుగు విభాగాలుగా రైల్వేలను అభివృద్ధి చేస్తున్నామని, మౌలిక వసతులు, ప్రయాణికుల సదుపాయాలు, మూరుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ, ఉపాధి కల్పనే తమ లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, ఒడిషా, తెలంగాణలో.. కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని, రైల్వే ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో వర్చ్యువల్‌గా పాల్గొన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పలువురు ప్రజా ప్రతి నిధులు హాజరయ్యారు.



సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది.

కాగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, వి.సోమన్న, రవనీత్ సింగ్, బండి సంజయ్, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు హాజరయ్యారు. కాగా ఈ నెల7వ తేదీ నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

# కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల బాండ్లు ఇచ్చింది. 2023లో ఫార్ములా ఈ రేసు జరిగింది. కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కారణంగా గ్రీన్ కో నష్టపోయింది. అందుకే మరుసటి ఏడాది స్పాన్సర్‌షిఫ్ నుంచి తప్పుకుంది. అది క్విడ్ ప్రోకో ఎలా అవుతుంది..? ఇది రేవంత్ రెడ్డి టీం చేస్తున్న దుష్ప్రచారం. పార్లమెంట్ ఆమోదించిన ఎన్నికల బాండ్లు అవినీతి ఎలా అవుతుంది. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీకు వచ్చిన బాండ్లపై చర్చకు సిద్ధం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహించిన గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్‌ఎస్‌కు రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు ప్రభుత్వం పేర్కొంది. బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 41 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు 26 సార్లు బాండ్లు కొన్నట్లు తెలిపింది. 2022లో ఏప్రిల్ 8 నుంచి అక్టోబర్ 10 మధ్య బాండ్లు కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏప్రిల్ 8న 20 బాండ్లు, అక్టోబర్ 10న 6 బాండ్లు కొన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.



ఫార్ములా-ఈ కారు రేసు కేసులో విచారణ నిమిత్తం కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు చేరుకున్నారు. అయితే న్యాయవాదులతో కలిసి విచారణకు రావడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏసీబీ ఆఫీస్ ప్రధాన గేటు వద్దే కేటీఆర్ కారును అడ్డుకున్నారు. దీంతో సుమారు 45 నిమిషాలపాటు అక్కడే వేచి ఉన్నారు. తనను అడ్వకేట్ల సమక్షంలోనే విచారించాలని పట్టుబట్టారు. పోలీసులు అనుమతించకపోవడంతో విచారణకు హాజరు కాకుండా అక్కడి నుంచి వెనుతిరిగారు. అయితే ఈ క్రమంలో తన లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌ను ఏసీబీ డీఎస్పీకి అందించారు.

ఏసీబీ తనపై నమోదు చేసిన కేసులో తాను తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని అందులో ప్రస్తావించారు. అలాగే 'తనకు పంపిన నోటీసులు కేసుకు సంబంధించి తన నుంచి సమాచారంతోపాటు సంబంధిత పత్రాలను ఏసీబీ కోరింది. అయితే అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇవ్వలేదు. అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇచ్చి.. తనకు కొంత సమయం ఇవ్వాలని అందులో కోరారు. అదేవిధంగా రాజ్యాంగం, చట్టం తనకు కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే.. కేసు దర్యాప్తునకు హాజరై సహరిస్తానని తెలిపారు. అయితే హైకోర్టులో తాను వేసిన క్వాష్ పిటిషన్ తీర్పు రిజర్వులో ఉందని, తీర్పు వచ్చేదాకా తనకు గడువు ఇచ్చే అవకాశం పరిశీలించాలని' ఏసీబీ డీఎస్పీ మజిద్ ఖాన్‌ని కోరారు.

# ఒక్క విద్యార్థి కూడా లేని 2097 పాఠశాలలు

**హైదరాబాద్ :** దేశంలో విద్యా వ్యవస్థ రోజు రోజుకు మరింత దిగజారిపోతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) ప్లస్ ఒక నివేదిక రిలీజ్ చేసింది. అందులో ఆసక్తి గొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఒక వైపు వసతి గృహాలు, మరో వైపు గురుకులాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్తున్న అధికారులకు సాధారణ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. గురుకులాల కోసం కార్పొరేట్ స్థాయిలో భవనాలను నిర్మించి పేద, మధ్య తరగతి పిల్లలకు విద్య అందిస్తోంది. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మారుస్తామని చెప్తున్న ప్రభుత్వాధికారులకు కొన్ని పాఠశాలలు తలనొప్పిగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య మరింత దిగజారుతుందనేందుకు నిదర్శనంగా 2,000 పాఠశాలల్లో విద్యార్థులు లేరని ఖాళీ తరగతి గదులు మాత్రమే ఉన్నాయని విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక చెప్తోంది. 2023-24కి సంబంధించిన జఆమోఇ ప్లస్ నివేదిక ప్రకారం.. మొత్తం 2,097 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేదని పేర్కొంది. ఇది రాష్ట్రంలో పాఠశాల విద్య పరిస్థితిని హైలైట్ చేస్తుంది. పశ్చిమ బెంగాల్ 3,254, రాజస్తాన్ 2,167 పాఠశాలల తర్వాత జీరో ఎన్‌రోల్‌మెంట్‌లతో అధిక సంఖ్యలో పాఠశాలలతో తెలంగాణ దేశంలోనే మూడో రాష్ట్రంగా నిలిచింది. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నప్పటికీ, పాఠశాలల్లో 2,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.మొత్తం 88,429 మంది విద్యార్థులతో 5,985 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని వెలుగులోకి వచ్చిన మరో ఆశ్చర్యకరమైన సమాచారం. 2023-24 విద్యా సంవత్సరంలో అన్ని మేనేజ్‌మెంట్ల కింద మొత్తం 72,93,644 మంది విద్యార్థులు, 3,41,460 మంది టీచర్లతో రాష్ట్రం 42,901 పాఠశాలలకు నిలయంగా మారింది. ఇంకా, ప్రభుత్వ పాఠశాలల్లో 2021-22లో 33,03,699 నుంచి 2022-23లో 30,09,212కి 2023-24 విద్యా సంవత్సరంలో 27,79,713కి తగ్గింది.రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు సున్నా డ్రాపౌట్ రేటు నమోదైంది. అయినప్పటికీ సెకండరీ స్థాయిలో 13.3 శాతం బాలురు, 9.5 శాతం బాలికలు పాఠశాలకు రావడం మానివేయడంతో డ్రాపౌట్ రేటు 11.4 శాతానికి పెరిగింది. పై స్థాయికి వెళ్లేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఇంకా, 42,901 పాఠశాలల్లో 11.8 శాతం 10 కంటే తక్కువ విద్యార్థుల నమోదు చేసింది కేవలం 8.7 శాతం పాఠశాలల్లో మాత్రమే 500 కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు.బాలికలు, బాలురకు మరుగుదొడ్లు లేని పాఠశాలల గురించి కూడా నివేదిక పేర్కొంది. 29,383 బాలికల పాఠశాలల్లో 2,017 మరుగుదొడ్లు లేవని, మిగిలిన వాటిలో 2,277 మరుగుదొడ్లు పనిచేయడం లేదని, బాలుర విషయానికొస్తే 28,689 పాఠశాలల్లో 4,823 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 2,618 పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయని తెలిపింది.




## గురుకుల విద్యార్థి శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్సీ కవిత

**ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వాంకిడీ ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతిచెందిన బాలిక శైలజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. శైలజ చిత్రపటానికి కవిత పూలమాల వేసి నివాళు లర్పించారు. గతంలో నిమ్స్ ఆస్పత్రిలో శైలజ చికిత్స పొందే క్రమంలో ఎమ్మెల్సీ కవిత పరామర్శించిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ శైలజ మరణించిన విషయం తెలిసి చలించిన ఎమ్మెల్సీ కవిత %ొ% ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు. దాంతో అప్పుడు ప్రకటించిన రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని స్వయంగా బాలిక నివాసానికి వెళ్లి అందించారు. శైలజ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత వెంట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## పేద, మధ్య తరగతి ప్రజలకు తీపికబురు!

-మొదటిపేజీ తరువాయి

చిగురించాయి. అయితే ఈ రేషన్ కార్డు కోసం ఏమి చేయాలి, ఎలా పొందాలనే అనుమానాలు చాలామందికి ఉండొచ్చు. జనవరి 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు జారీచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో కొత్త కార్డు పొందాలంటే ఏమి చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ దరఖాస్తుతోనే రేషన్ కార్డులు లేనివారు తమ వివరాలను పొందుపర్చారు. రేషన్ కార్డుకోసం దరఖాస్తుచేసుకున్న వారి వివరాలు పరిశీలించిన ప్రభుత్వం.. అర్హులను గుర్తించినట్లు తెలుస్తోంది. వీరికి కొత్త రేషన్ కార్డులను జనవరి 26న అందించనుంది. అదే విధంగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు సైతం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. ఈనెల15వ తేదీ నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో అర్హులను గుర్తించి కొత్త రేషన్ కార్డులను జారీ చేయనుంది. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు సమర్పిస్తే ఈనెలలోనే కొత్తకార్డులు ఇంటికి రానున్నాయి.

**రేషన్ కార్డులతో లింక్..**

ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డుతో లింక్ పెట్టిన తెలంగాణ ప్రభుత్వం.. ఇక నుంచి ఆ విధానంలో మార్పులు తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులను ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేయాలనే ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం. రేషన్ కార్డుతో ప్రభుత్వ పథకాలను ముడిపెట్టడం ద్వారా అనర్హులు సైతం రేషన్ కార్డులు పొందుతుండటంతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ఓటర్ల సంఖ్య 3.35 కోట్లు..

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకుగాను శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 7,65,982 మంది, భద్రాచలంలో అత్యల్పంగా 1,54,134 మంది ఓటర్లు ఉన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోందని.. రీజనల్ రైల్ అవసరం కూడా ఉందన్నారు. రైల్ రింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రధాని కోరుకుంటున్న 5 ట్రిలియన్ ఎకానమీ సకారం కావాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి జరగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటుందన్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రాభివృద్ధికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. 1 ట్రిలియన్ ఎకానమి కాంట్రిబ్యూట్ చేసేందుకు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాగా.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. అలాగే జనవరి 7 నుంచి సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

## కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీళ్లా ప్రవర్తిస్తున్నారు



వరంగల్: ఓరుగల్లును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలో భద్రకాళి ట్యాంక్ బండ్, టెక్స్ టైల్ పార్క్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి వెల్లడించారు. వరంగల్ రీజియన్‌కు తెలంగాణ ఆర్టీసీ కేటాయించిన 112 ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇవాళ(సోమవారం) 50 బస్సులను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రం హయగ్రీవాచారి గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి బస్సులను ప్రారంభించారు. మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముగ్గురు మంత్రులూ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "పర్యావరణానికి హాని కలగకుండా తెలంగాణ ఆర్టీసీని అప్డేట్ చేస్తున్నాం. అందుకే ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్‌కు ఏ టెక్నాలజీ వచ్చినా వెంటనే దాన్ని వరంగల్‌కూ తెస్తాం. ఉమ్మడి ఏపీలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. 4.5 లక్షల గృహాలను ఇప్పుడు మొదటి విడతలో ఇస్తాం. రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం. అన్ని మండలాల్లో మోడల్ ఇందిరమ్మ గృహాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం. సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ చేస్తాం. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని పంపించాం. 80 లక్షల మంది ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్క్రూటినీ చేసి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తాం. దరఖాస్తు చేసుకోని వారు భయపడాల్సిన పనిలేదు. ఇందిరమ్మ గృహాలు అనేది నిరంతర ప్రక్రియ, అర్హులకు తప్పకుండా ఇస్తాం. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అందిస్తాం. రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎకరానికి రూ.12 వేలు చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, రేషన్ కార్డులు అందిస్తాం. భూమిలేని అర్హులైన పేదలకు ఏటా రూ.12వేలు ఇస్తాం. బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్ ఒకవేళ 200 ఎకరాలు సాగు చేస్తే ఆయనకూ రైతు భరోసా ఇస్తాం. 25 లక్షల మంది అన్నదాతలకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. సన్న వడ్లు పండించిన రైతన్నలకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం పదేళ్లలో మర్చిపోయిన రేషన్ కార్డులను మేము ఇవ్వబోతున్నాం. ప్రజలు ఇందిరమ్మ రాజ్యంలో ఏం కోరుకున్నారో అవన్నీ నెరవేరుతాయి. పేదోడి సొమ్ము విదేశాలకు పంపించిన అక్రమార్కుడిపై చట్టప్రకారం కేసులు పెడితే ప్రతిపక్షాలు రౌడీళ్లా ప్రవర్తిస్తున్నాయి. ప్రతిపక్షాల చిల్లర మాటలకు మా అభివృద్ధి పనులే సమాధానం చెప్తాయని" అన్నారు.

## సంపాదకీయం

# భారత్‌లో సహజీవన సంసారాలు

నేటి భారత యువతలో కూడా సహజీవన సంస్కృతి పెరుగుతున్నట్లు, యువతలో దాని పట్ల సానుకూల భావాలు చిగురిస్తున్నట్లు తెలుస్తున్నది. సహజీవన విధానం భారత్‌లో చట్ట వ్యతిరేకం కానప్పటికీ, సామాజిక అంగీకారం లేకపోవడం, సహజీవన పద్ధతిని దురాచారంగా కూడా పరగణించడం జరుగుతుంది. భారత్‌లో సహజీవనం చేస్తున్న జంటను చులకనగా చూడడం, వివక్ష చూపడం, సామాజిక వ్యతిరేకతను ఎదుర్కోవడం కొనసాగుతోంది. భారతంలో మూడు ముళ్లు పడక ముందే 18 ఏళ్లు పైబడిన జంట అంగీకారంతో సహజీవన సంసారాలకు సంబంధించిన నిర్దిష్టమైన చట్టాలు కూడా లేకపోవడం విశేషం. 'ఏక పత్ని వ్రతం'తో పాటు 'ఏక పతి వ్రతం' పునాదుల మీద పెరిగిన భారతీయ పౌర సమాజం సహజీవన సంసారాలను తీవ్రంగా వ్యతిరేకించడం చూస్తున్నాం. ఆధునిక డిజిటల్ యుగపు భారత యువతలో రోజు రోజుకు, ముఖ్యంగా మహానగరాల్లో సహజీవన సంసారాలు పెరుగుతున్నాయని, సగానికి పైగా యువత వీటిని అంగీరిస్తున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లోని ముంబాయి మహానగరం సహజీవన సంసారాలకు కేంద్రంగా నిలుస్తున్నది. సహజీవనానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదా అనుమతులు అవసరం లేదని, విడిపోవు సందర్భాల్లో విడాకులు తీసుకోవడం లాంటి ప్రస్తావన ఉండదని తెలుసుకోవాలి. సహజీవనం చేసిన యువ జంటలు అధిక శాతం వరకు వివాహాలు కూడా చేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారత మహానగరాల్లో 50 శాతం వరకు యువత సహజీవన బాటన నడుస్తున్నారని తెలుస్తున్నది. విరాట్ కోహ్లీ–అనుష్క శర్మ, అమీర్ ఖాన్–కిరణ్ రావ్, సైఫ్ అలీ ఖాన్–కరీనా కపూర్, జాన్ అబ్రహమ్–బిపాసా బసు, బోను కపూర్–శ్రీదేవి లాంటి పలువురు బాలీవుడ్ జంటలు సహజీవనం చేసిన తర్వాతనే వివాహం చేసుకున్నారని మనకు తెలుసు. దినదినం సహజీవన సంబంధాలు పెరగడం, నేటి పౌర సమాజం కూడా నెమ్మదిగానైనా వాటిని అంగీకరించడం జరుగుతున్నది. నేటి డిజిటల్ యువత పెళ్లికి ముందే సహజీవన సంసారాలకు మొగ్గు చూపడానికి ప్రధాన కారణాలుగా వారి మధ్య అభిరుచుల ఏకీకరణ స్పష్టత, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే వివాహం చేసుకోవడానికి నిర్ణయం తీసుకోవడం, ఇద్దరి మనోభావాలను అర్థం చేసుకోవడం, ఆర్థిక సమస్యలను అధిగమించడం, భావోద్వేగ సమతుల్యతల సాధన, గృహ సంబంధ పనులను పంచుకోవడం, పెళ్లి చేసుకోకుండానే శారీరక మానసిక అనుభవాలను స్వంతం చేసుకోవడం, వివాహం చేసుకోవడానికి ఇష్టపడని యువత సహజీవన పద్ధతులను ఆచరణలో పెట్టడం, పిల్లల్ని కనడం/పెంచడం భారం అనుకునే యువత, లైంగిక వాంఛలను మాత్రమే తీర్చుకోవడం, పెళ్లికి పూర్వం ఒకరినొకరు అర్థం చేసుకోవడం, ప్రేమతో సహజీవనం చేసి పెళ్లితో ముగింపు పలకడం లాంటి పలు అంశాలను పేర్కొనవచ్చు. భారత రాజ్యాంగ ఆర్టికిల్ 21 ప్రకారం పౌరులకు స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా కల్పించబడిందని, దీని ప్రకారం సహజీవనం నేరంగా పరిగణించబడదని సుప్రీమ్ కోర్టు కూడా పేర్కొనడం విశేషం. అదే విధంగా 2005 గృహ హింస చట్టం ప్రకారం కూడా సహజీవన సంబంధాలను "గృహ సంబంధాలుగానే (డొమెస్టిక్ రిలేషన్‌షిప్)" చూడాలని నిర్ణయించింది. చట్ట పరిధిలో సహజీవనం చేసిన యువతి కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో భరణం లేదా మెయిన్‌టెనెన్స్ పొందే హక్కు కూడా ఉంటుందని తెలుపుతున్నది. సహజీవనం చేసిన జంటకు జన్మించిన సంతానానికి ఆస్తి హక్కులు సంక్రమిస్తాయని తెలుస్తున్నది. సహజీవనం చేస్తున్న జంటను వారి తల్లితండ్రులు కూడా విడదీయలేరని చట్టం పేర్కొంటున్నది. సహజీవనం చేసిన జంటకు చట్టం ఎలాంటి రక్షణ కల్పించకపోవడంతో వివాహిత యువతులకు కల్పించిన చట్ట రక్షణలు వీరికి వర్తించవు. సహజీవన జంట మధ్య విభేదాలు వచ్చినపుడు వెంటనే వారు విడిపోయి తమ తమ జీవితాలను కొనసాగించే వెసులుబాటు మాత్రం ఉన్నది. దీర్ఘకాలం పాటు సహజీవనం చేయడం, పౌర సమాజంలో ఆ జంట కలిసి తిరగడం, ఇద్దరికీ 18 ఏండ్లకు పైగా వయస్సు ఉండడం, పెళ్లి అయిన జంట వలె లైంగిక సంబంధాలను కలిగి ఉండడం, ఇద్దరి ఆదాయాలను కలిపి ఖర్చు చేయడం, గృహ సంబంధ పనుల్లో పరస్పరం సహాయం చేసుకోవడం, ఇద్దరు తమ హక్కులు బాధ్యతలను పంచుకోవడం, సంతానాన్ని కనడం లాంటి ప్రత్యేక సందర్భాల్లో సహజీవనాన్ని కూడా వివాహం జరిగినట్లుగానే భావించాలని పేర్కొనడం జరుగుతోంది. 18 ఏండ్లు దాటిన ఒక యువతి, ఒక యువకుడు పెళ్లికి ముందు ఒక అంగీకారానికి వచ్చి ఒకే ఇంట్లో కలిసి జీవించడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి దీర్ఘకాలం పాటు జంటగా జీవించడాన్ని 'సహజీవనం లేదా లివ్–ఇన్ రిలేషన్‌షిప్' అని పిలుస్తాం. సహజీవనంలో ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకొని ఇష్టపడిన తర్వాత పెళ్లి కూడా చేసుకోవడం జరుగుతుంది లేదా ఇద్దరి అలవాట్లు/అభిరుచులు/ఆచారాలు/జీవనశైలి/ఆలోచనలు కలువవని నిర్ణయించుకున్నపుడు ఆ సహజీవన జంట విడిపోయి స్వేచ్ఛగా బతకడానికి నిర్ణయించుకుంటారు. సహజీవన సంసారాల్లో యువ జంట లైంగిక సంబంధాలను కూడా కొనసాగించవచ్చు. డేటింగ్ అనే ఆచారం 1 – 3 మాసాల స్వల్పకాలం పాటు ఇద్దరు కలిసి తిరగడం, వేరు వేరు ఇండ్లల్లో జీవిస్తున్నప్పటికీ కలిసి తిరుగుతూ అన్ని రకాలుగా ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నంగా భావించాలి. ఒక ఆహార పదార్థాన్ని ఎలా ఉందో రుచి చూసినట్లు, ఇద్దరి మధ్య సంబంధాన్ని కూడా డేటింగ్‌తో కొద్ది సమయంలోనే తెలుసుకోవడం జరుగుతుంది. డేటింగ్‌లో జంట లైంగిక సంబంధాలను తప్పనిసరిగా పెట్టుకోవాలనే నియమం లేకపోయినప్పటికీ అదే ప్రధాన అంశంగా కూడా తీసుకోబడుతున్నది. డేటింగ్ సంబంధాన్ని సీరియస్‌గా కూడా తీసుకోవలసిన పని లేదు. అది ఒక తేలికైన స్వల్పకాలిక సంబంధం కూడా అయి ఉండవచ్చు. ఇద్దరిలో ఒకరు యువతి, మరొకరు యువకుడు కావచ్చు లేదా ఒకే లింగానికి చెందిన జంట కూడా డేటింగ్ చేయవచ్చు. జంట ఒక మంచి స్నేహితులుగా కలిసి తిరగడాన్ని కూడా డేటింగ్‌గా భావించవచ్చు. డేటింగ్ చేసిన జంట కొంతకాలం తర్వాత సహజీవనం లేదా వివాహ మండపానికి కూడా దారి తీయవచ్చు.ప్రేమ వివాహాలు అన్ని కొనసాగడం లేదని, పెద్దలు కుదుర్చు వివాహాలు కూడా విడాకుల వరకు వస్తున్నాయని గమనించి, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ, పెళ్లంటే ఒక జంట మాత్రమే ఒక్కటి కావడం కాదని, రెండు కుటుంబాల కలయికగా వివాహాన్ని చూస్తున్న పౌర సమాజంలో జీవిస్తున్నామని తెలుసుకుంటూ నేటి యువత పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించకుండా తమ జీవితాలకు పెళ్లితో చక్కటి శాంతియుత కుటుంబ నిర్మాణ పరిష్కారం ఇవ్వాలని కోరుకుందాం. ప్రేమించిన వ్యక్తిని నేరుగా వివాహం చేసుకోవడం ఉత్తమమని, సహజీవన సంసారం మాత్రం చక్కటి పరిష్కారం కాదని తెలుసుకుందాం. నేటి యువత సీతారాములను ఆదర్శ జంటగా తీసుకోవాలని, అందమైన జీవిత భాగస్వామికి అందరి సమక్షంలో మూడు ముళ్లు వేయాలని ఆశిద్దాం.

# ప్రత్యేక చట్టాలకు దూరంగా ఆదివాసీలు



దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశంలోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించ బడ్డారు. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గత కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా. పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని,ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది.

# జైపూర్ కృత్రిమ కాలు సృష్టికర్త సేథీ

తెలుగు చలన చిత్ర రంగంలో ఒక మరుపురాని అద్భుత చిత్రరాజం మయూరి. ఆ రోజుల్లో ఆ సినిమా ఒక సంచలనం. సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించగా, 1985లో విడుదల చేసిన చిత్రం. నర్తకియైన సుధా చంద్రన్ నిజ జీవితం ఆధారంగా సహజత్వం ఉట్టిపడేలా తీసిన చిత్రం. ప్రమాదం కారణంగా ఒక కాలు కోల్పోయిన స్థితిలో, నిరాశ నిస్పృహలకు లోను కాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్ట పడి సాధన చేసి, కృత్రిమ కాలు తోనే నాట్య ప్రదర్శనలు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాట్య మయూరి జీవితమే ఆ సినిమా కథ నేపథ్యం. ఆ నర్తకే సుధా చంద్రన్. ఆమె జీవిత నేపద్యమే మయూరి సినిమా కథా వస్తువు. ఆ సినిమాలో మయూరి పాత్ర పోషించింది స్వయాన సుధా చంద్రన్ కావడమే విశేషం. సుధా చంద్రన్ జైపూర్ వెళ్ళి కృత్రిమ కాలును అమర్చు కోవడాన్ని మయూరి సినిమాలో చూస్తాం. ఆ కృత్రిమ పాదం, కాలు రూపకర్త ఎవరో చాలా మందికి తెలియదు. ఆయనే... కాళ్ళు కోల్పోయిన ఎందరికో, కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన, దేశం గర్వించ దగిన ప్రముఖ శస్త్ర వైద్యుడు పి.కె.సేథీగా పేరెన్నిక గన్న ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమోద్ కరణ్ సేథీ (నవంబర్ 28, 1927 – జనవరి 7, 2007) భారతీయ శస్త్ర వైద్యుడు, జైపూర్ కృత్రిమ పాదం (జైపూర్ ఫుట్) సృష్టికర్త. 1927, నవంబర్ 28 న ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జన్మించాడు. కాళ్ళు కోల్పోయిన అనేక మందికి కృత్రిమ కాలు అమర్చి ఎందరికో నడక నేర్పిన సేథీ గిన్నిస్ బుక్ రికార్డులో కూడా నమోదు కా బడి, ప్రశంసాపత్రం అందుకున్నాడు. 1981లో సామా జిక సేవా రంగంలో ఆసియా లోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా అయన పొందాడు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిం చి పద్మశ్రీ పురస్కారంతో సత్కరిం చింది. పుట్టుకతోనే కాలు లేకుండా జన్మించిన వికలాంగులకు, విధి వంచితులై, ఎన్నో రకాలుగా కాళ్ళు కోల్పోయిన వారికి, ఎందరో సైనికు లకు, దాడుల్లో గాయపడిన అమా యకులకు ఇలా ఎందరికో, అంగ వైకల్యం కలుగ కుండా, తిరిగి నడక నేర్పాడు, జీవితాలలో వెలుగు ప్రసాదించాడు సేథీ. ఎముకల వైద్య నిపుణుడైన సేథీ 1969లో పరిచితుడైన, నిరక్షురా స్యుడైన చేతివృత్తి నిపుణుడు రామచంద్ర శర్మతో కలిసి జైపూర్ పాదాన్ని తయారు చేశాడు. కొత్త ఆవిష్కరణకు తెర లేపాడు. అంతకు ముందు, జైపూర్ పాదం తయారు చేయడానికి ముందు కృత్రిమ కాలు అమర్చు కోవాలంటే ఖర్చు ఎక్కువగా అయ్యేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సేథీ... రబ్బరు, చెక్క, అల్యూమినియంతో కృత్రిమ పాదం తయారుచేసి తక్కువ ధరలో సామాన్యులకు అందు బాటులో ఉండేలా కృషి చేశాడు. 1975 వరకు కూడా ఈ కృత్రిమ పాదాన్ని అమర్చుకున్న వారు చాలా తక్కువే. అఫ్ఘనిస్తాన్ యుద్ధం తరువాత జైపూర్ ఫుట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ (ప్రస్తుత రష్యా) అమర్చిన మందు పాతరల వల్ల కాళ్ళు కోల్పోయిన అనేక మందికి అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ జైపూర్ ఫుట్‌లను అమ ర్చింది. కార్గిల్ యుద్ధంలో కాళ్ళు కోల్పోయిన అనేక సైనికులు కూడా జైపూర్ పాదాలనే అమర్చు కున్నారు. ప్రముఖ నటి సుధా చంద్రన్ కూడా జైపూర్ ఫుట్‌నే అమర్చుకొని మయూరి చిత్రంలో నటించి పలువురి ప్రశంసలు అందుకొన్న విషయం తెలిసిందే.

ప్రమోద్ కరణ్ సేథీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించగా, అత్య ధికులకు కృత్రిమ అవయవం అమర్చినందులకు సేథీ పేరును గిన్నిస్ బుక్ లో రికార్డు చేశారు. ఆసియాలోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా సేథీని వరించింది. డాక్టర్ బిసి రాయ్ అవార్డు ప్రముఖ వైద్య ఉపాధ్యాయుడిగా, 1979, పద్మశ్రీ – ప్రభుత్వం ఆఫ్ ఇండియా 1981, మాగ్సేసే అవార్డు – మనీలా, 1981, సైంటిఫిక్ అచీవ్‌మెంట్ కోసం గిన్నిస్ అవార్డు, 1982. (రాజస్థాన్ విశ్వ విద్యా లయం) 1982, అత్యుత్తమ వైద్య పరిశోధనలకు ఆర్.డి.బిర్లా అవార్డు,1984, నాడ్ జాన్సెన్ లెక్చర్ అండ్ మెడల్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ప్రోస్తేటిక్స్ అండ్ ఆర్థోయిటిక్స్, కోబ్, జపాన్ 1989, డాక్టర్ బిసి రాయ్ నేషనల్ అవార్డు ఆఫ్ ది ఇమినెంట్ మెడికల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ న్యూ ఢిల్లీ 1989, డాక్టర్ బి. ముఖోపాధ్యాయ ఓరేషన్ ఆర్థో పెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ – బరోడా 1998, గౌరవ ఫెలోషిప్, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 1999, ప్రపంచ అండర్స్టాండింగ్ మరియు శాంతికి రోటరీ అంతర్జాతీయ అవార్డు శాన్ ఆంటోనియో, యుఎస్ఎ 2001, 20 వ శతాబ్దంలో అత్యుత్తమ పరిశోధనా శాస్త్రవేత్తకు అవార్డు – ఆర్థోపెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యు కేషన్ ఫౌండేషన్ – పాట్నా 2002, నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇండియా – 2004, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ఆఫ్ ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసి యేషన్, డిసెంబర్ 2004 తదితర ఎన్నో అవార్డులను ఆయనను వరించాయి. కాళ్ళు కోల్పోయిన ఎందరికో కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన సేథీ 2007, జనవరి 7 న జైపూర్‌లో మరణించారు.

# చట్టసభల్లో అరుదైన నేత పాపిరెడ్డి



అవిభక్త ఆంధ్రప్రదేశ్ సీనియర్ రాజకీయ నాయకులు బెజవాడ పాపిరెడ్డి జయంతి, వర్ధంతి రెండు రోజుల తేడాతో వస్తాయి. అన్ని చట్టసభల్లో సభ్యుడిగా ఎంపికై రికార్డు సృష్టించిన నేతగా బెజవాడ బాపిరెడ్డి చరిత్ర పుటల కెక్కారు. రాజకీయాలకు చిరునామాగా, మచ్చలేని నేతగా పాపిరెడ్డి గుర్తింపు పొందారు. విలువలకు మారు పేరుగా నిలిచారు. తెలుగు దేశం స్థాపనా సమయంలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు పార్టీ గుర్తుగా సైకిల్ ను సూచించింది పాపిరెడ్డి కావడం గమనార్హం. బెజవాడ పాపిరెడ్డి 1927, జనవరి 5 న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై వివిధ చట్ట సభ లలో పనిచేసిన అనుభవం గడించారు. 1958 నుంచి 1962 వరకు శాసనమండలి సభ్యుడిగా, 1967 నుంచి 1972 వరకు అల్లూరు శాసనసభ్యుడిగా, 1972 నుంచి 1978 వరకు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఈ మూడింటిలో కూడా ఆయన ఇండిపెండెంట్‌గానే గెలవడం విశేషం. 1969–72లో బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ బాధ్యునిగా, 1976–77లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, 1977–78 పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా పని చేశారు. 1983–84 లో ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గా ఉన్నారు. ఆదినుండి జాతీయ కాంగ్రెస్ వ్యతిరేక నేతగా రాజకీయాల్లో మన గలిగిన పాపిరెడ్డి, తెలుగు దేశం ఆవిర్భావంతో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు 1983లో ఆ పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీని ప్రారంభించే సమయానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక రాజకీయాల్లో రాటు తేలిన నాయకునిగా కొనసాగుతున్న బెజ వాడ పాపిరెడ్డి గురించి తెలుసు కుని, ఆయన అనుభవాన్ని, అవసరాన్ని గుర్తించి, ఎన్టీఆర్, బెజవాడ పాపిరెడ్డిని తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించి, సముచిత గౌరవంగా పార్టీ ఉపాధ్యక్ష పదవిని అప్పగించారు. ఎన్టీ రామారావు రాజకీయ పార్టీ స్థాపించిన తర్వాత తొలిసారిగా 1983 ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో ఎన్నికల గుర్తు కోసం ఆలోచిస్తున్న సమయంలో పాపిరెడ్డి సైకిల్ ను ఎన్నికల గుర్తుగా పెట్టాలని సూచించారు. 1967లో ఆయన అల్లూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి గా సైకిల్ గుర్తు'పై విజయం సాధించిన నేపథ్యంలో పాపిరెడ్డి సెంటిమెంట్ ను అనుసరించి ఈ సూచన చేయగా, ఎన్టీ రామారావు పాపిరెడ్డి సూచనను వెంటనే ఆమోదించి సైకిల్ ను తెలుగు దేశం పార్టీ ఎన్నికల గుర్తుగా ప్రకటించారు. ఆయన 1983 నుంచి 1985 వరకు తెలుగుదేశం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రథమంగా రాజ కీయ పార్టీ పక్షాన అల్లూరు నుంచి శాసనసభకు పోటీ చేసి గెలు పొందారు. పాపిరెడ్డి పార్టీ ఆదేశాను సారం 1984లో ఒంగోలు లోక్‌సభ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నెల్లూరు జిల్లాలో సంగం ఆనకట్ట నుండి కావలి ప్రాంతానికి సాగు, తాగు నీటిని తీసుకు వెళ్లి, కావలి కాలువకు బెజవాడ పాపిరెడ్డి పేరు పెట్టడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించారు. బెజవాడ పాపిరెడ్డి అస్వస్థత కారణంగా 75 ఏట 2002, జనవరి 7 న హైదరాబాదులో మరణించారు.

# మండలానికి 108 అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే







**నిజాంపేట,జనవరి6(సూర్యరేఖ)**దమండల కేంద్రంలో సోమవారం నూతనంగా 108 అంబులెన్స్ ను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా జెండాను ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని.,ప్రజల కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే ప్రతి మండలానికి ఒక 108 అంబులెన్స్ ను ఏర్పాటు చేశామన్నారు.రానున్న రోజుల్లో బ్రహ్మాండంగా నిజాంపేట, రామయంపేట మండలాలను మరింత అభివృద్ధిపదంలో నడిపిస్తామన్నారు.అనంతరం నస్కల్ గ్రామానికి చెందిన వార్త జర్నలిస్టు పాతూరి నర్సింలు గౌడ్, అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరమార్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారుతి,పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి,వై. వెంకటేశం,మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబు,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,అబ్బా రెడ్డి,మోహన్ రెడ్డి,లింగంగౌడ్, లాలాగౌడ్,బాజారమేష్ గుమ్ముల అజయ్, యూత్ అధ్యక్షులు రామచందర్ నాయక్, వినోద్, సూర్య నాయక్,శ్రీనివాస్ నాయక్, మధుసూదన్ రెడ్డి, భాస్కర్ గౌడ్, నాగరాజు, సూరారాములు, మ్యాదరిరాజు, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు







**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం,జనవరి 06(సూర్యరేఖ)**దప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.సోమవారం,జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,డిఆర్ఓ భుజంగరావు,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్ డిఓపిడి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా (61) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు.పింఛన్ల కొరకు-03, భూ సమస్యల - 20,ఇందిరమ్మ ఇండ్ల కొరకు-11, ఇతర సమస్యలు-27 ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.అదే విధంగా అర్జీలు పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు.ఎటువంటి నిర్ల క్ష్యం వహించరాదని,అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని,అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, ఇతర శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు






**ప్రధానం చేసిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్**

**తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు..**

**ఉప్పల్,జనవరి 06(సూర్యరేఖ)**మీరు పేట్ హెచ్ బికాలనీ డివిజన్ లోని తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ గ్రౌండ్ నందు నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ పోటీల్లో కాలనీలోని మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.గెలుపొందిన ఐదుగురు విజేతలకు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాల్గొన్న అందరి మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్లేశ్ గౌడ్,అమరేంద్ర బాబు, వెంకన్నగౌడ్,రాంప్రదీప్, శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణమోహన్ శేఖర్, రంగసాయి, మురళీకృష్ణ, శ్రీనివాస్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ సిపిఎస్ ఈయు రాష్ట్ర కార్యదర్శిగా సుభాష్ నియామకం..



**నిజాంపేట,జనవరి06(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా సుభాష్,ను నియమిస్తున్నట్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుభాష్ ని జిల్లా సంఘం అధ్యక్షులు ఎల్లయ్య,ప్రధాన కార్యదర్శి చరణ్ సింగ్ కోశాధికారి చంద్రం,లు అభినందనలు తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి శాయా శక్తుల కృషి చేస్తా..

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్,జనవరి 06(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.సోమవారం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని టీఎస్ ఐఐసి కాలనీలో రూ.30 లక్షల నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి,మున్సిపల్ ఏఈ కీర్తి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం -2 లో పోలీసుల అవగాహన కార్యక్రమం






**ఉప్పల్,జనవరి 06(సూర్యరేఖ)** ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం - 2 లో విద్యార్థులకు ఉప్పల్ పోలీసులు,షిటీమ్స్ సంయుక్తంగా సోమవారం అవగాహన కల్పించారు.షీటీమ్స్ , ఉప్పల్ సబ్ ఇన్స్పెక్టర్లు చిరంజీవి,మధు,ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమన్నారు.పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా,వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100,181 లకు,గాని లేదా షి టిమ్స్ -8712662111 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను,మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చిన్న విషయాలకు ఆవేదనకు గురికాకూడదని,మంచి ఆలోచనతో చదువుకోవాలని సూచించారు.ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై కూడా దృష్టి సారించాలన్నారు.క్రమశిక్షణతో ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సదస్సు,కరపత్రం ఆవిష్కరణ..

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి..**

**రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజునరేష్**



**ఉప్పల్,జనవరి 06(సూర్యరేఖ)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రజక వృత్తిదారుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ సర్కిల్ లో జనవరి 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రజకులకు ఉపాధి కల్పన,ప్రభుత్వ హామీల అమలు కోసం,జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్ రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో రజకులకు ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని ఆ హామీలను అమలు చేయాలని రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో జీ.వో నెంబర్ 2 ప్రకారం అమలవుతున్న ఉచిత విద్యుత్ పథకానికి ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు అనేకచోట్ల వృత్తిదారులని పాత బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తూ,బెదిరిస్తున్నారని సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించి ఉచిత విధి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.రజకుల సమస్యలపై సదస్సులో చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని అందుకు వృత్తిదారులు అందరు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.బీసీ రిజర్వేషన్లను ఏబిసిడి వర్గీకరణ చేసి,జరగబోయే స్థానిక ఎన్నికల్లో,అత్యంత వెనుకబడిన వృత్తి కులాలకు అవకాశాలు వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ రిజర్వేషన్లను ఏ,బి,సి,డి వర్గీకరణ చేయాలని,అదేవిధంగా రక్షణ చట్టం చేయాలని,50 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సందర్భంగా డిమాండ్ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సౌడారం సుభద్ర,జిల్లాప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్, కోశాధికారి సట్టు రవి,జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి,జిల్లా కమిటీ నాయకులు, ఉమా, ఏ.సదానందం, ఎన్.రమేష్, ఏ.లింగం,ఎస్. బిక్షపతి,పరకాల సారాయ్య, ఆర్.రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరాంఘర్-జూపార్క్ పై వంతెనను ప్రారంభించిన ముఖ్యమంత్రి





**రాజేంద్రనగర్,జనవరి06** ఆరాంఘర్ - జూపార్క్ రెండో అతిపెద్ద ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.సోమవారం ఒవైసీ సోదరులతో కలిసి నెహ్రూ జూపార్క్ నుంచి ఆరాంఘర్ వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆరులేన్ల పై వంతెనను ప్రారంభించారు.నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు జూపార్క్ నుంచి ఆరాంఘర్ 4.08 కిలోమీటర్ల పొడుగునా దాదాపు రూ.800 కోట్లతో ఈ పైవంతెనను జిహెచ్ఎంసి నిర్మించింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఇతర నేతలు పాల్గొన్నారు.4 కిలో మీటర్ల పొడువుగా 6 వరుసల్లో ఆరాంఘర్ ఫ్లైఓవర్ నిర్మించారు.పీవీ ఎక్స్ ప్రెస్ వే తర్వాత నగరంలో రెండో అతిపెద్ద పై వంతెన ఇదే.ఎస్ఆర్ డీపీలో భాగంగా రూ.799 కోట్లతో పైవంతెనను నిర్మించారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో సీఎం రేవంత్ రెడ్డి రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

# ఓటరు జాబితాను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**కొల్చారం,జనవరి 06(సూర్యరేఖ)** భారత ఎన్నికల సంఘం (ఈసిఐ)మార్గదర్శకాలు, సూచనల ప్రకారం,ప్రత్యేక సవరణ 2025 లో భాగంగా మెదక్ జిల్లా పరిధిలోని 34-మెదక్, 37-నర్సాపూర్,అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలను రాహుల్ రాజ్,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సోమవారం (06.01.2025) విడుదల చేశారు.34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని1,04917 మంది పురుషులు, 1,15987 మంది మహిళలు, 04 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 220908 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 9 మంది పురుషులు, 1మహిళ ఎన్ఆర్ఐ ఓటర్లు 10 మంది ఉన్నారని,సర్వీస్ ఓటర్లలో 87 మంది పురుషులు,2 మహిళలు కలిపి 89 మంది ఉన్నారు.37-నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని 1,11611 మంది పురుషులు, 118701 మంది మహిళలు,05 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 2,30317 సాధారణ ఓటర్లు ఉన్నారు.వీరిలో( 1) మంది పురుషులు ఎన్ఆర్ఐ ఓటరు ఉండగా,సర్వీస్ ఓటర్లలో 36 మంది పురుషులు,02 మహిళలు కలిపి 38 మంది ఉన్నారు.మొత్తం జిల్లావారీగా 216528 మంది పురుషులు,234688 మంది మహిళలు, 09 మంది థర్డ్ జెండర్ కలిపి 451225 సాధారణ ఓటర్లు ఉన్నారు.వీరిలో 10 మంది పురుషులు,1 మహిళ కలిపి 11 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు.సర్వీస్ ఓటర్లలో 123 మంది పురుషులు, 04 మహిళలు కలిపి 127 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల ప్రకారం పై ఓటర్ల జాబితాలను సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో, ఈఆర్ ఓ కార్యాలయాల్లో, ఏఈఆర్ఓ తాహసిల్దార్ కార్యాలయాల్లో అలాగే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయంలో ప్రచురించారు.ఓటర్లు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందని ధృవీకరించుకోవాలని ఏవైనా పొరపాట్లు లేదా మార్పులు అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని లేదా అధికారిక ఎన్నికల వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

## మంచినీటి పైపులైను పనులు పూర్తికాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం..

**నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జనశేఖర్**



**ఉప్పల్,జనవరి 06(సూర్యరేఖ)** మంచినీటి పైపులైను పనులు పూర్తి కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జనశేఖర్ పేర్కొన్నారు.నాచారం ఓల్డ్ విలేజ్ లో జరుగుతున్న నూతన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు గవర్నమెంట్ స్కూల్ నుండి సుమారు 200 మీటర్లు మంచినీటి పైప్ లైన్లు లేకపోవడంతో రోడ్డు పనులను ఆపడం జరిగిందని తెలిపారు.ఈ సమస్య తెలిసిన వెంటనే కార్పొరేటర్ శాంతి సాయి జనశేఖర్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకువచ్చి వేయవలసిన 200 మీటర్ల నాలుగు ఇంచుల పైప్ లైన్ వేయించే పనులను ప్రారంభించడం జరిగింది. ఈ పైప్ లైన్ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జనశేఖర్,భూపాల్ రెడ్డి,కట్ట బుచ్చన్నగౌడ్,భరత్ రామ్,చందర్,ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీకి క్షమాపణ చెప్పాలి..




**కామారెడ్డి,జనవరి 06(సూర్యరేఖ)** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినా భారతీయ జనతా పార్టీ మాజీ ఎంపీ బీదూరి రమేష్ కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ ప్రియాంక గాంధీకి వెంటనే క్షమాపణ చెప్పాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ మహిళలను అవేలన చేసి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆమె అన్నారు.ఢిల్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి మహిళలు తగిన బుద్ధి చెప్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అల్కలాంబ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల మేరకు ఈ ప్రకటన జారీ చేయడం జరిగిందని పాక జ్ఞానేశ్వరి తెలిపారు.బిజెపి మాజీ ఎంపీ రమేష్ బీదూరి వెంటనే క్షమాపణ చెప్పి ఎన్నికల నుంచి తప్పుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఆమె అన్నారు.

## హైదర్ గూడ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సైన్స్ స్కూల్లో కనీస సదుపాయాలు కరువు..

**విద్యార్థుల ముక్కు పిండి లక్షల్లో ఫీజులు వసూలు..**

**మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు,స్థానికులు**

**పట్టించుకోని విద్యాశాఖ అధికారులు..**




**రాజేంద్రనగర్,జనవరి06** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ గుమ్మకొండ కాలనీలో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సైన్స్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఫీజు లేమో లక్షల్లో తీసుకుంటూ కనీస సదుపాయాలను కల్పించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.విద్యార్థులు ఆడుకునేందుకు కనీసం గ్రౌండ్ సదుపాయం కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలా మధ్యలో సందులో ఇరికిరుకుగా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా పాఠశాలకు వచ్చేవారు పార్క్ చేసేందుకు పార్కింగ్ కి కూడా దిక్కులేదని మండిపడుతున్నారు.స్కూలు వదిలిన సమయంలో పాఠశాల రహదారిలో వెళ్లాలంటేనే నరకయాతనను ప్రయాణికులు అనుభవిస్తున్నారు.స్కూల్లో అడ్మిషన్లు లేవంటూ లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. అంతేకాకుండా అనుమతులు లేకుండానే స్కూలు బిల్డింగ్ పై షెడ్ నిర్మాణం చేశారని అన్నారు.ఇలాంటి కార్పొరేట్ స్కూళ్లకు విద్యాశాఖ అధికారులు సహకరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.తక్షణమే పాఠశాల గుర్తింపు రద్దుచేసి అందరూ చదువుకునేలా వెసులుబాటు,ఆమోదయోగ్యమైన ఫీజులు తీసుకొని పేద విద్యార్థులను ఆదుకోవాలని పలువురు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

# న్యూ హేమానగర్ ముదిరాజ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ





**హైదరాబాద్,జనవరి 6 (సూర్యరేఖ)** బోడుప్పల్ న్యూ హేమనగర్ ముదిరాజ్ సంఘం -2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మకు సుగుణ బాలయ్య,22 డివిజన్ కార్పొరేటర్ దొంతర బోయిన మహేశ్వరి కృపసార్,బొమ్మకు బాలయ్య, ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షురాలు మన్నే రేవతి, మేడ్చల్ జిల్లా మురారి సంఘం అధ్యక్షులు దొంతర బోయిన కృపా సార్,ముదిరాజ్ సంఘం వ్యవస్థాపకుడు దొంతరబోయిన ఆనందబాబు ముదిరాజ్,న్యూ హేమనగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మన్నె అంజయ్య, జనరల్ సెక్రెటరీ దొంత బోయిన శ్రీనువాసు,సురేష్ దైవదిని బిక్షపతి ముదిరాజ్ సంఘం సభ్యులు,మహిళలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడాది పూర్తైనా ఇచ్చిన హామీల అమలేది..?

**పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..**
**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి..**

**కొల్చారం,జనవరి 06(సూర్యరేఖ)** ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా విద్యారంగానికి,ఉపాధ్యాయులకు ఇచ్చిన చాల హామీలు నేటికీ నెరవేర్చకపోవడం,ఎన్నికల్లో ఇచ్చిన ఉద్యోగులకు హామీలను నెరవేర్చాలని టిపిటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం కొల్చారం మండలములో పలు పాఠశాలలను సందర్శిస్తూ సమస్యల సేకరణ చేశారు.స్థానిక కొల్చారం ఉన్నత పాఠశాలలో కాలమణిని ఆవిష్కరించడం జరిగింది.ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు హామీ ఇచ్చిన ప్రకారం రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులను సత్వరమే విడుదల చేయాలని,ఇకనుంచి ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లించాలని,ఉద్యోగ విరమణ పొందిన వారికి ఇవ్వాల్సిన చెల్లింపులు వెంటనే అందజేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు.జి.ఓ.317 వల్ల స్థానికత కోల్పోయిన అందరిని బేషరతుగా సొంత జిల్లాలకు పంపాలని పెండింగులో ఉన్న డి,ఏ,లను విడుదల చేయాలని,అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పి.ఆర్.సి. అమలు చేస్తామన్న,సీపీఎస్ ను రద్దు చేస్తామన్న వాగ్దానాన్ని



ఇప్పటికైనా నిలుపుకోవాలని, విద్యారంగానికి బడ్జెట్ లో 15 శాతం నిధులు కేటాయించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి,రాష్ట్ర కౌన్సిలర్ సంగయ్య,మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగం గౌడ్,పిండి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో ఎంఐఎం హడావిడి ఏంటి..!





**ప్రశ్నించినందుకు బిజెపి నాయకుల అరెస్టు తగదు..**
**ఫ్లైఓవర్ పరిసరాల్లో ఎంఐఎం జెండాలు,తోరణాలు ఎలా కడతారు..**
**ఎంఐఎం కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తిన తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జనవరి06** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నూతనంగా ప్రారంభించే ఫ్లైఓవర్ వద్ద ఎంఐఎం పార్టీ సందడి ఏంటని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం పార్టీకి కొమ్ము కాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ ఎలైట్ హొటల్లో బిజెపి పార్టీ సమావేశంలో ఉండగా పోలీసులు ముందస్తు అరెస్టు ప్రయత్నం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం ఉందని అన్నారు.అయితే ఎంఐఎం పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారిన సీఎం వారు ఏమి చేసినా అడగడం లేదని మండిపడ్డారు.కోట్ల రూపాయల ప్రజాధనంతో ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తే ఎంఐఎం పార్టీ తోరణాలు, జెండాలు ఎలా కడతారని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ అంశం పట్టడం లేదా అని ప్రశ్నించారు. బిజెపి పార్టీ



నాయకులను అక్రమ అరెస్టులతో అడ్డుకోవాలని ప్రయత్నాలను మానుకోవాలని అన్నారు. ఇలాంటి ప్రయత్నాలను చేస్తే బిజెపి సహించబోదని మండిపడ్డారు. ఎంఐఎం పార్టీ చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా ఉంటే కామెంట్ చేస్తామని కానీ ప్రజలకు మాత్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఎంఐఎం పార్టీలు ఇలాంటి అరెస్టులతో బీజేపీని అడ్డుకోలేరని మరోసారి స్పష్టం చేశారు.

## అత్య పత్య క్రీడల్లో సత్తా చాటిన రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు..




**రాజేంద్రనగర్,జనవరి06** అత్య పత్య ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్ర రాజ్య అత్యపత్య మహా మండల ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ పురుషుల,33వ మహిళల సీనియర్ జాతీయ అత్య పత్య ఛాంపియన్షిప్ లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు.ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన ఛాంపియన్షిప్లో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.సిహెచ్ నర్సింలు,జి.మనోజ్ లు పాల్గొని మంచి ప్రతిభను కనబరిచారు.ఈ సందర్భంగా అత్య పత్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ అత్యపత్య క్రీడాకారుడు అమర్ సింగ్,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ప్రభాకర్లకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా సంఘం సభ్యులు క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ...తమకు ప్రోత్సాహం అందినందుకే క్రీడల్లో ప్రతిభ కనబరిచామని అన్నారు.ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుతామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం సభ్యులు వేముల మహేశ్వరి,మండలం మహేందర్ లాల్ సింగ్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**రామాయంపేట,జనవరి06(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గజం చంద్రం గత శనివారం తన వ్యవసాయ పొలం వద్ద పనులు చేస్తూ ప్రమాదవశాత్తు పొలంలో పడి మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం రోజు గజం చంద్రం కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో చంద్రం గతంలో క్రియాశీలకంగా పని చేశాడని తెలిపారు.ఆ కుటుంబ సభ్యులకు తాను అన్ని విధాలా అండగా ఉంటానని పేర్కొన్నారు.అదేవిధంగా గ్రామంలో ఉన్న గట్టు కవిత బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.ఆయన వెంట రామాయంపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాత రావు,పల్లె రామచంద్రం గౌడ్,రమేష్ రెడ్డి,అల్లాడి వెంకటేష్,వినయ్ సాగర్, విప్లవ్ కుమార్,విద్యాసాగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిన్న సహదేవ్,వెంకట్ గౌడ్, రామచంద్రం,భూ కరుణ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి..



**నాడు కేటీఆర్ రాజేంద్రనగర్ సర్కిల్ హసన్ నగర్ లో ఫ్లైఓవర్ పనులకు ప్రారంభం..**
**ఎన్నికల కోడ్ దృష్ట్యా ఫ్లైఓవర్ను ప్రారంభించలేకపోయినా బీఆర్ఎస్ ప్రభుత్వం..**
**హైదరాబాద్ నుంచి ఫ్లైఓవర్ ప్రారంభించడం బాధాకరం..**
**మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ**




**రాజేంద్రనగర్,జనవరి06** బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి సాధ్యమైందని మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ అన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షతతో కూడిన పాలనను కొనసాగిస్తుందని ఆయన విమర్శించారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ ఫ్లైఓవర్ పనులను పూర్తయ్యాక మాత్రం ఫ్లైఓవర్ను హైదరాబాదు నుంచి ప్రారంభించడం బాధాకరమని అన్నారు. స్థానికంగా ఫ్లైఓవర్ పనులు ప్రారంభించే క్రమంలో హసన్ నగర్ లో నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రారంభించినట్లు గుర్తు చేశారు.కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డును రాజేంద్రనగర్ నుంచి కాకుండా హైదరాబాదులో ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. స్థానికంగా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ప్రారంభోత్సవ పనులను ఇక్కడి నుంచి చేయకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు.ఈ ఫ్లైఓవర్ ఎన్నికలకు ముందే పూర్తయిందని,కానీ నాడు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రారంభానికి ఆటంకం ఏర్పడిందని అన్నారు.సరిగ్గా సంవత్సరం తర్వాత కాంగ్రెస్ ఫ్లైఓవర్ను ప్రారంభించిందని వివరించారు.కానీ రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి ఫ్లైఓవర్ను ప్రారంభించకపోవడం మనస్థాపానికి గురి చేసిందని,ఇది ప్రభుత్వానికి తగదని అన్నారు.వివక్షతతో కూడిన పాలన చేయడం తగదని హితువు పలికారు.

సూర్య


# కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మిస్తే ఎంఐఎం ఫ్లెక్సీలు,బ్యానర్లు ఏర్పాటు చేయడం ఏంటి



**మండిపడ్డ బీజేవైఎం నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జనవరి06** ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన అరంఘర్ వంతెన పరిసరాల్లో ఎంఐఎం పార్టీ ఫ్లెక్సీలు జెండాలు తోరణాలు ఏంటని భారతీయ జనతా పార్టీ యువ మోర్చ రాజేంద్రనగర్ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి మండిపడ్డారు.ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ...ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పూర్తై ప్రారంభానికి ఏర్పాటైన నేపథ్యంలో ఎంఐఎం బ్యానర్లు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు.ఎంఐఎం పార్టీ సొంత డబ్బులతో ఈఫ్లై ఓవర్ ను నిర్మించిందా అంటూ ధ్వజమెత్తారు.రాష్ట్ర ప్రభుత్వం,రాజ్యాంగాన్ని ఎంఐఎం పార్టీ అవమానించిందని అన్నారు.సీఎంను ఎంఐఎం నాయకులు అవమానించినా కాంగ్రెస్ కు పట్టడం లేదని ఎద్దేవా చేశారు.ఎంఐఎం తీరు మార్చుకోవాలని రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించవద్దని హితువు పలికారు.

# మైలార్ దేవులపల్లి డివిజన్ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం





**అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోతే సహించేది లేదు..**

**అభివృద్ధి పనులను పర్యవేక్షించిన తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జనవరి06** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్,అధికారులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆయన జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మైలార్ దేవులపల్లి డివిజన్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని,ఈ విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత కొరవడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ మేరకు అధికారులతో సమీక్షలు చేపడుతున్నామని వివరించారు. దీంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నామని అన్నారు. ఎక్కడైనా నాణ్యత కొరవడినట్లు ప్రజలు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఇప్పటికే డివిజన్లో కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేపట్టామని వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నామని వివరించారు.ఈ మేరకు జలమండలి జిహెచ్ఎంసి అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని వివరించారు. ప్రజల సైతం ఏవైనా సమస్యలు ఎదుర్కుంటే తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి బస్తీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్,స్థానిక నాయకులు రమేష్ రెడ్డి,సంతోష్,కిషన్ నాయక్, రమణ, గోపాల్ నాయక్, శంకర్, చందు,తలారి చిన్న, శంకర్ రెడ్డి, అమర్,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# బిసి డిక్లరేషన్ ను కట్టుబడి అమలు చేయాలి

**ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వైఫల్యం..**

**ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పాలనను ఎండగడతాం..**

**రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ**



**గండిపేట్,జనవరి06**సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ను కట్టుబడి వెంటనే బీసీలకు న్యాయం చేయాలని రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట అంటుందని అన్నారు.బిసి డిక్లరేషన్ అంటూ కామారెడ్డిలో హడావిడి చేసి ఎన్నికలు పూర్తికాగానే ఆ హామీని గాలికి వదిలేసారని అన్నారు.ఇదేవిధంగా కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను ఒక్కోదాన్ని నీరుగార్చేలా ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బిజెపి పార్టీ తరఫున ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు హామీలు అమలయ్యేలా చూస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరినీ మోసగించిందని,ఏ విధంగా ప్రజలను మోసగించిందో ప్రజలకు వివరిస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సమయాన్ని పూర్తిచేసినా నేటికీ బీసీ డిక్లరేషన్,ఇచ్చిన ఆరు హామీలను సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు.ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే ప్రజాక్షేత్రంలో పోరాడి కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షులు చిక్కిర బిక్షపతి యాదవ్, ఉపాధ్యక్షులు దండోటికర్ నాగేష్,శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి ఓబీసీ నాయకులు



**రామాయంపేట,జనవరి06(సూర్య రేఖ)** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన కుటుంబ సర్వే పేరిట రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేసిందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్ అన్నారు.మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఓబీసీ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్ మాట్లాడుతూ..కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలకు ప్రకటించిన పథకాలు ఏమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు.కుటుంబ సర్వే పేరిట ప్రజలను తికమక పెడుతూ సంక్షేమ పథకాలను ఎగవేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.తిరిగి ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరుస్తారో వివరించవలసిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు.అదేవిధంగా రామాయంపేట మండలంలో ఓబీసీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్,రామాయంపేట మండలం ఓబిసి మోర్చా అధ్యక్షులు బక్కయ్య గారి యాదగిరి,ఇప్ప రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన మెదక్ జిల్లా ఎస్పీ



**మెదక్,జనవరి06(సూర్య రేఖ)** మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల ఎస్సై,సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేశారు.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ,వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన వివరించారు.ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలిపారు.

## నేడు రామాయంపేట పట్టణ స్వచ్ఛంద బంద్



**రామయంపేట,జనవరి06(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో నేడు (మంగళవారం) వాణిజ్య వ్యాపార సంస్థలు పట్టణ స్వచ్ఛంద బంద్ కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా వాణిజ్య వ్యాపార సంస్థలు, ప్రజలు మాట్లాడుతూ..మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో రామాయంపేట పట్టణం నుండి అంతకు ముందు నియోజకవర్గం పోయిందన్నారు.అలాగే గతంలో రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు కాలేదన్నారు.జిల్లాలో కొత్తగా మండలాలు ఏర్పాటు కావడం వల్ల రామాయంపేట మండలం చిన్నదిగా మారిందన్నారు. దీనివల్ల పట్టణంలో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిని పట్టణ అభివృద్ధి కుంటు పడిందన్నారు.ఇప్పుడు కొత్తగా మెదక్ సిద్దిపేట ఎల్కతుర్తి కి వెళ్లే జాతీయ రహదారి పట్టణంలోని పాత రహదారి గుండా కాకుండా,రామాయంపేట పట్టణంలోని బైపాస్ ద్వారా వెళ్తుందన్నారు.ఇప్పటికే హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపు వెళు న్న బస్సులు బైపాస్ రోడ్డు గుండా వెళ్తున్నాయన్నారు.రామాయంపేటలో 80 శాతం బస్సులు పట్టణంలోనికి రాకుండా కొత్తగా ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే సిద్దిపేట నుండి మెదక్ వెళ్లే బస్సులు పట్టణంలోకి పూర్తిగా రాకుండా పోతాయన్నారు. కాబట్టి బైపాస్ రోడ్డు నిర్మాణం కాకుండా ఊరిలో నుండి పాత రోడ్డు ద్వారా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి తెలియజేస్తూ రామాయంపేట పట్టణ స్వచ్ఛంద బంద్ కు పిలుపునిస్తున్నట్లు,దీనికి పట్టణ ప్రజలు,వాణిజ్య వ్యాపార సంస్థలు సహకరించాలని వారు కోరారు.

# పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి

**ఎంపీడీవోలు తహసీల్దార్లు ప్రజావాణికి తప్పనిసరిగా రావాలి..!**

**కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ :** కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి అనంతరం వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు ధరణి భూ సేకరణకు సంబంధించిన దరఖాస్తుల కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని అన్ని హాస్టళ్లను తనిఖీ చేసి సౌకర్యాలు పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులు, ఎంఈఓలకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని సూచించారు. త్వరలో మండల ప్రత్యేక అధికారులు, ఎంఈఓలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను ఈ నెల 30 వ తేదీలోగా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజావాణి లో సమర్పించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. తమ పరిధిలోని భూ సేకరణకు సంబంధించిన కేసులను అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఆర్డీవోలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇటీవల జరిగిన దిశా కమిటీ సమావేశానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు వివరాలు అందించాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ. లబ్ధిదారుల గుర్తింపునకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయడంపై అధికారులను అభినందించారు. ఇంకా ఎక్కడైనా మిగిలి ఉంటే పూర్తి చేయాలన్నారు. యాప్ లో వివరాలను తప్పుగా నమోదు చేసినట్లు తేలితే సర్వే చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అంచనా వ్యయం, పెండింగ్ బిల్లుల వివరాల వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఈజీఎస్, ఆర్అండ్ బీ, ఎస్డీఎఫ్ పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డీఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ మద్యం అలవాట్లకు దూరంగా ఉండాలి

**ప్రతి విద్యార్థి శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.**

**గోదావరిఖని ఏసీపి మడత రమేష్**



**కమాన్ పూర్ :** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అన్నారు. సోమవారం కమాన్ పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు జూలపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపి మడత రమేష్ మాట్లాడుతూ . . చాలావరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మధ్యతరగతి వారే చదువుతారని తల్లిదండ్రులను వేధించకుండా పాఠశాలకు కళాశాలకు వచ్చి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. యువత నేడు పెడదారిన పడుతుందని గంజాయి మద్యం ధూమపానానికి అలవాటు అవుతున్నారని అటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మైనర్ విద్యార్థులకు వాహనాలు వారి తల్లిదండ్రులు ఇస్తే తండ్రి యొక్క లైసెన్సును రద్దు చేయడం జరుగుతుందని అన్నారు ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేసి ప్రమాదాలకు గురవుతున్నారని దీంతో తల్లిదండ్రులకు ఖర్చుతో కూడిన పని అని అన్నారు. చాలామంది విద్యార్థులు కళాశాలలకు రాకుండా బయట తిరక్కుండా చెడుగాలవాటులకు దగ్గరవుతున్నారని అటువంటి విద్యార్థులను గుర్తించి వారికి సరైన సమాధానం చెప్పడం జరుగుతుందని అన్నారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు రైతులు మరియు దినసరి కూలీలు చేసుకుంటూ మీ మిమ్ములను చదివించడం జరుగుతాయని అన్నారు. వారిని వేధించి ద్విచక్ర వాహనాలు ఇప్పించాలని కోరడం సరికాదని వారు కైకలి కూలి చేసి మిమ్ములను ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు యువత గంజాయి మత్తు పదార్థాలకు మరియు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాదరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, జూలపల్లి తాజా మాజీ సర్పంచ్ బొల్లేపల్లి శంకర్ గౌడ్, కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్, ఏ ఎస్ ఐ లు రహీం ఖలీల్ ఖాన్, మరియు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కిన్నెరసాని ఉపనదిలో దొంగలు పడ్డారు

**-మీడియా ముసుగులో అక్రమ ఇసుక దందా**

**-నిషారాత్రిలో అడ్డుఅదుపు లేకుండా ఇసుక రవాణా**

**-రెవెన్యూ, అధికార పార్టీ నేతలు, ప్రధాన పత్రికల పాత్రికేయులు అక్రమ దందాలో మిలాకత్**

**-అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్న కిన్నెరసాని**

**-గత నెల రోజులుగా యథేచ్ఛగా సాగుతున్న దందా**

**భద్రాద్రి :** ప్రజాస్వామ్యంలో ఫోర్త్ పిల్లర్ గా పిలవబడే మీడియాలో కొందరూ (ప్రధాన పత్రికలు) బూర్గంపాడు మండలంలో అక్రమాలతో రాజ్యమేలుతున్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీసి, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా సామాజిక బాధ్యతగా వ్యవహరించాల్సిన జర్నలిస్టులు కోట్లు సంపాదించేలనే లక్ష్యంతో అక్రమాలకు తెరలేపుతూ అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రధాన పత్రికలలో, శాటిలైట్ ఛానెల్ లో వర్కింగ్ జర్నలిస్టులుగా చలామణి అవుతూ, మీడియా అనే ముసుగు వేసుకున్న కొందరూ జర్నలిస్టులు, అధికార పార్టీ నేతలు, మాజీ జెడ్పిటిసి, రెవెన్యూశాఖ సిబ్బంది సహాయంతో గత నెల రోజులుగా సహజ సంపదను అక్రమంగా ఎల్లలు దాటిస్తున్నారు. తిలపాపం తలపిడికెడు అన్న చందంగా మీడియా, అధికార పార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ, రెవెన్యూశాఖ సిబ్బంది కలిసి నిషారాత్రిలో ఇసుకను లారీలతో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలంలోని సోంపల్లి, బుడ్డగూడెం, ఉప్పుసాక, నాగారం గ్రామాలోని సరిహద్దుల్లో ఉన్న కిన్నెరసాని ఉపనది నుండి అక్రమంగా ఇసుకను భారీ యంత్రాల సహాయంతో టిప్పర్లలో లోడు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి లక్షలు తమఖాతాలో వేసుకుంటున్నారు.

**సోంపల్లి గ్రామంలో పాత్రికేయులు అక్రమంగా ర్యాంపు**

బూర్గంపాడు మండల పరిధిలోని కిన్నెసాని పరివాహక ప్రాంతమైన సోంపల్లి గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రధాన పత్రికలలో పనిచేసే కొందరూ పాత్రికేయులు కలిసి నెల రోజులుగా అక్రమంగా ఇసుక ర్యాంపు ను ఏర్పాటు చేసుకొని జేసిబి యంత్రాలతో టిప్పర్లల్లో లోడుచేసి నిరంతరాయంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులు కంచె చేను మేసిన చందంగా అధికార పార్టీ నాయకులు, ప్రధాన పత్రికలలో పనిచేసే కొందరూ పాత్రికేయులు కలిసి అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే చూసే వారు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు, ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అవినీతి, అక్రమాలను వెలికితీయాల్సిన ప్రధాన పత్రికల జర్నలిస్టులు కొందరూ మీడియా ముసుగులో అక్రమ ఇసుక దందా చేస్తుంటే స్థానిక ప్రజానీకం ఇండ్లలో దుమ్ము, దూళి, పడి రహదారులు పాడవుతున్నాయనే ఆవేదనను వ్యక్తం చేస్తూ.. బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్ధం గాక లోలోపల మదన పడుతున్నారు.

**మాజీ జెడ్పిటిసి అక్రమ ఇసుక దందా..**

బుడ్డగూడెం గ్రామంలో అధికార పార్టీకి చెందిన మాజీ జెడ్పిటిసి,అతని అనుచరులు పట్టపగలే కిన్నెరసాని ఉపనది లో జేసిబి పెట్టి ట్రాక్టర్లు ద్వారా ఇసుకను మైదాన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ప్రక్కన డంపు చేసి రాత్రి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బుడ్డగూడెం గ్రామస్థులను ప్రసన్నం చేసుకోని, ప్రశ్నించకుండా గిరిజనులకు గోవులను కోసుకోవడాని దానంగా ఇచ్చి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. మాజీ జెడ్పిటిసి చేసే అక్రమ దందాలకు అధికారుల సపోర్టు పుష్కలంగా ఉండడంతో ప్రశ్నించాల్సిన గొంతుకలు మూగబోతున్నాయి. అర్ధరాత్రి 2 రెండు గంటల నుండి అక్రమ ఇసుక టిప్పర్లను బుడ్డగూడెం జంక్షన్ నుండి జింకలగూడెం మీదుగా సీతారమా ప్రాజెక్టు వెంబడి రవాణా చేస్తూ చెక్ పోస్ట్ ను దాటిస్తున్నారు. ప్రధాన పత్రికల పాత్రికేయులు కావడంతో ఎవరూ నోరు మెదపడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**ఒకరిని చూసి మరోకరు ఇసుక దందా.!**

మండలంలోని ప్రధాన పత్రికల పాత్రికేయులు చేస్తున్న అక్రమ ఇసుక దందాను చూసి అదే మండలానికి చెందిన శాటిలైట్ ఛానెల్, యుట్యూబ్ ఛానెల్, పిడిఎఫ్ పత్రికలలో పనిచేసే జర్నలిస్టులు కిన్నెరసాని ఉపనది పరివాహక గ్రామాలైన నాగారం, ఉప్పుసాక ప్రాంతాల్లో అక్రమ ఇసుక దందా తగ్గేదెలా అంటూ వారి పంథాను జులుంపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న బూర్గంపాడు మండల రెవెన్యూ అధికారులు, అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, మాజీ జెడ్పిటిసి, ప్రధాన పత్రికల జర్నలిస్టులు, శాటిలైట్ ఛానెల్, యూట్యూబ్, పిడిఎఫ్ పత్రికలలో పనిచేసే మీడియా మిత్రులు అడ్డుఅదుపు లేకుండా చేసే అక్రమ ఇసుక దందాను అరికట్టాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులను స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఏసీబీ ఆఫీసువద్ద హై డ్రామా

**హైదారబాద్ :** తెలంగాణలో రాజకీయంగా ప్రకంపనలు రేపుతున్న ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. బంజారాహిల్స్ ఏసిబి వద్ద కేటీఆర్ వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కేటీఆర్ వెంట లాయర్లను వెళ్లడానికి అనుమతించకపోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన వెంట లాయర్లు ఎందుకు రాకుడదు అని కేటీఆర్ అధికారులను ప్రశ్నించారు. దాదాపు అరగంటపాటు అక్కడ ఎదురుచూసిన కేటీఆర్.. చివరికి ఏసీబీ ఆఫీసులోపలికి వెళ్లకుండానే వెనుదిరిగారు.విచారణకు అడ్వకేట్‌కు అనుమతి ఇవ్వాలంటూ ఏసీబీకి కేటీఆర్ న్యాయవాది నోట్ ఇచ్చారు. నోట్ తీసుకున్న ఏసీబీ అధికారులు లాయర్లను వెంట పంపించేందుకు అనుమతించలేదు. చట్ట ప్రకారం ప్రతి పౌరుడికి ఉన్నతన హక్కులను వినియోగించుకోవచ్చునని.. లాయర్లను లోపలికి అనుమతించకపోవడంపై కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏసీబీ ఆఫీసు నుంచి కేటీఆర్ వెళ్లిపోయారు. అటు నుంచి నేరుగా తెలంగాణ భవన్ కు వెళ్లి పార్టీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తాను చట్టాలను అనుసరించి, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచి అంతకుముందు సోమవారం ఉదయం నందినగర్ లోని తన తండ్రి, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి కేటీఆర్ వెళ్లారు. అక్కడ లీగల్ టీమ్ తో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఫార్ములా ఈ కారు రేసు కేసుకు సంబంధించి ఏసీబీ ప్రశ్నలపై ఎలా స్పందించాలి, చెప్పాల్సిన సమాధానాలపై లాయర్లతో చర్చించారు కేటీఆర్. అనంతరం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమావేశమయ్యారు. భేటీ ముగిసిన తర్వాత కేటీఆర్ నేరుగా ఏసీబీ ఆఫీసుకు విచారణకు హాజరయ్యారు. 2022 జులై లో హైదరాబాద్ లో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ లో దాదాపు 50 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులను బీఆర్ఎస్ సర్కార్, మాజీ మంత్రి కేటీఆర్ విదేశీ సంస్థలకు అనుమతులు లేకుండా మళ్లించారని ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్ అనుమతి కోరారు. నెల రోజులకు గవర్నర్ జిష్ణుదేవ్ పర్మిషన్ తో ఏసీబీ అధికారులు కేటీఆర్ పై కేసు నమోదు చేశారు.

## బొంతపల్లి లో సే నో టు డ్రగ్స్ ర్యాలీ

**సంగారెడ్డి :** పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలో మండల యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ నివారణకు బొంతపల్లి కమాన్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జ్ ఎంపీడీవో ఉమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత మద్యం గంజాయి డ్రగ్స్ గుట్కా వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని స్వామి వివేకనంద స్ఫూర్తితో ముందుకు సాగాలని జానపద కళాకారుల గీతాలతో పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు వడ్డే ఎల్లయ్య మంద భాస్కర్ రెడ్డి చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ సార్ రెడ్డి గారి బిక్షపతి రెడ్డి సుదర్శన్ విష్ణు పాండు యువజన సంఘాల నాయకులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు



**సిద్దిపేట :** 267 చైనా మాంజా బండల్స్ విలువ 1,19,700 సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ది మురళి బాలాజీ బుక్ డిపో సిద్దిపేట పట్టణం అతని పాత ఇల్లు పారుపల్లి స్ట్రీట్ లో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా కలిగి ఉన్నాడని మరియు రహస్యంగా అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు వెళ్లి పాత ఇంటిలో తనిఖీలు చేసి 267 చైనా మాంజా బండల్స్, అందాజ విలువ 1,19,700 గలవి స్వాధీనం చేసుకుని సిద్దిపేట టూ టౌన్ పోలీసులకు అప్పగించడం జరిగింది. సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు

ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ. గ్రామాలలో పట్టణాలలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఎవరైనా కలిగి ఉన్నా ఇతరులకు అమ్మిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైలాల్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటు ఎగిరే పక్షులకు ప్రమాదకరం రోడ్ల పై మోటార్ సైకిల్ తో వెళ్లే వారికి కూడా అది చూడకుండా మెడకు కాళ్లకు తట్టుకొని చనిపోయిన సంఘటనలు కూడా జరిగాయి. మరియు పర్యవరణానికి విపత్తుగా కావడంతో జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఆదేశాలను మేరకు చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఏవరైన చైనా మాంజా విక్రయిస్తున్న, కలిగి ఉన్న, సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు




**కరీంనగర్ :** సీనియర్ సివిల్ జడ్జ్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ ఆధ్వర్యంలో దుర్శేడు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నందు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు విద్యార్థి దశలో ముఖ్యంగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు, మాదక ద్రవ్యాలను సేవించడం కాని, మాదక ద్రవ్యాలను వినియోగించే వారితో స్నేహం చేయకూడదని మాదక ద్రవ్యాలను వినియోగించిన, కలిగి ఉన్న కఠినమైన చట్టాలు ఉన్నాయని కఠిన శిక్షలకు గురి కావాల్సి ఉంటుంది అని తెలియజేశారు, ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించాలని చెడు వ్యసనాలకు పాల్పడవద్దని గురువుల పట్ల వినయంగా వ్యవహరించాలని కోరారు పాఠశాల ఒక దేవాలయం లాంటిదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై కూడా ఉందని తెలియజేశారు. తమ పిల్లల యొక్క నడవడికను తల్లిదండ్రులు గమనించాలని హాజరైన తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైన సంప్రదించవలసిందిగా పాఠశాల సిబ్బందిని ఆదేశించారు, ఇట్టి కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ తో పాటు లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్లైన్ ధని లోన్ యాప్‌ల ద్వారా 2 కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్ల ముఠా పట్టివేత

**సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి :** ఆన్లైన్ ద్వారా ధని యాప్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు అమాయకులకు ఫోన్లు చేసి మీకు లోన్ సాంక్షన్ అయ్యిందని ఇన్సూరెన్స్, ప్రాసెసింగ్ ఫీజు పేరుతో కోట్ల రూపాయలు టోకరా పెట్టారు. సోమవారం రోజు జిల్లా పోలీస్ కార్యాలంలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐ పి ఎస్ విలేకరుల సమావేశంలో సైబర్ క్రైమ్ వివలాలు వెల్లడించారు. వనపర్తి టౌన్ కు చెందిన శ్రీ తోగుట రాజు, వయసు 43 సంవత్సరాలు, వృత్తి మెకానిక్, నివాసం: ఇంటి నెంబర్ 1-96/1 బాలనగర్, వనపర్తి టౌన్, తేది 17.12.2024 రోజు మధ్యాహ్నం 12:48 గంటల సమయంలో అతను ఫేస్బుక్ చూస్తుండగా, అష్ట్రజీనితి ఫైనాన్స్ లోన్ యాప్ ప్రకటనల పేజీ ను టచ్ చేయగా అతనికి ఒక అజ్ఞాత వ్యక్తి కాల్ చేసి మేము ధని ఫైనాన్స్ నుంచి మాట్లాడుచున్నాము మీకు ఏమైనా లోని కావాలనా అని అడిగినారు. అందుకు అతను 3 లక్షల రూపాయలు కావలెను అన్నాడు. మూడు లక్షల లోను ఇస్తాము దానికి ప్రతి నెల 8860 రూపాయలు కట్టాలి అన్నారు. ఈ విధంగా 36 నెలలు కట్టాలి అన్నారు. కొద్దిసేపటికి స్కానర్ పంపియగా అతని కొడుకు టి అరవింద్ ఫోన్ పే నుండి ఇన్సూరెన్స్ కొరకు అని మొదటగా 6,850/-లు ధర్మేంద్ర కుమార్ పేరు పై స్కానర్ ద్వారా పంపించినాడు, మరికొద్ది సేపటికి 8860/- రూపాయలు పైన ఉన్న స్కానర్ కు పంపించినరు, దానికి ఒక తిట నెంబర్ వచ్చినది, ఇట్టి మొత్తం నైట్ వరకు అకౌంట్ లొ జమ అయిపోతది అన్నారు. నైట్ వరకు వేచి చూసిన తర్వాత అకౌంట్ లోకి ఎలాంటి లోని డబ్బు రానాందుకు అతను 8:30 గం ల సమయంలో వారికి ఫోన్ చేసినాడు. ఎలాంటి సమాధానం లేదు.

# పార్వతి దేవిగా కాజల్ అగర్వాల్..

## 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. విష్ణు సరసన ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తుంది. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు మోహన్ లాల్, శరత్ కుమార్ తదితర ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా స్టార్ బ్యూటీ కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ శివుడి భార్య పార్వతి దేవిగా కనిపించబోతుంది. "ముల్లోకాలు ఏలే తల్లి ! భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి ! శ్రీ కాళ హస్తిలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక !" అంటూ ఫస్ట్ లుక్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాలో పరమశివుడి పాత్రలో అక్షయ్ కుమార్ నటిస్తుండగా.. పార్వతి పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు వెల్లడించింది.




# డైలమాకు చెక్..

## అజిత్‌కుమార్ గుడ్ బ్యాడ్ అగ్లీ థియేటర్లలోకి వచ్చేది అప్పుడే

అభిమానులను ఊపిరాడకుండా చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్ కుమార్ ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి గుడ్ బ్యాడ్ అగ్లీ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. టాలీవుడ్ టాప్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. ఈ చిత్రం పొంగళ్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందని వార్తలు వచ్చినా.. రిలీజ్ విషయంలో డైలామా కొనసాగుతూనే ఉంది. ఫైనల్‌గా మేకర్స్ విడుదలపై క్లారిటీ ఇచ్చేశారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త లుక్ ఒకటి షేర్ చేశారు. వేరే లెవల్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం డేట్ లాక్ చేశాం.. అంటూ లాంచ్ చేసిన పోస్టర్‌లో అజిత్ కుమార్ చేతిలో పిస్తోల్ పట్టుకొని సాల్ట్ పెప్పర్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. యోగిబాబు, రాహుల్ దేవ్, అర్జున్ దాస్, సునీల్, ప్రభు ఇతక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అజిత్ కుమార్ దీంతోపాటు మగిజ్ తిరుమేని డైరెక్షన్‌లో విదాముయార్చి సినిమా కూడా చేస్తున్నాడు. అజిత్ సార్ నాకు ఈ జీవితకాల అవకాశాన్ని అందించినందుకు ధన్యవాదాలు. నా కల నెరవేరింది. చివరి రోజు షూటింగ్.. ఎంత అందమైన ప్రయాణం..లవ్ యూ సో మచ్ సార్ అంటూ అధిక్ రవిచంద్రన్ షేర్ చేసిన వీడియో, ఫొటో ఇప్పటికే నెట్టింట రౌండప్ చేస్తూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి




# ట్రోల్స్‌తో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాను

## మీనాక్షి చౌదరి షాకింగ్ కామెంట్స్

ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్న భామల్లో ఒకరు మీనాక్షి చౌదరి ఈ బ్యూటీ గతేడాది దళపతి విజయ్‌తో ది గోట్ సినిమాలో మెరిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత లక్కీ భాస్కర్‌తో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది. అయితే ది గోట్ సినిమా ఈ బ్యూటీ మాత్రం ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. త్వరలోనే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రాబోతున్న సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకులకు హాయ్ చెప్పనుంది. ఈ సినిమా జనవరి 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి తన లైఫ్‌లో ఎదుర్కొన్న కష్టతరమైన విషయాన్ని ఒకటి షేర్ చేసుకుంది. విజయ్‌తో కలిసి నటించిన ది గోట్ సినిమా విడుదలయ్యాక నా నటనపై ఆన్‌లైన్‌లో చాలా ట్రోల్స్ వచ్చాయి. ఈ ట్రోల్స్‌తో వారంపాటు నేను డిప్రెషన్‌లోకి వెళ్లేలా చేశాయంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మీనాక్షి చౌదరి మరోవైపు జాతిరత్నాలు హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇటీవలే ఈ మూవీ నుంచి విడుదల చేసిన వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



# హాలీవుడ్ స్టైల్‌లో యశ్ బాస్..

## టాక్సిక్ ఫస్ట్ లుక్ లాంచ్ టైం ఫిక్స్

కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తర్వాత కన్నడ స్టార్ హీరో యశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం టాక్సిక్ పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. యశ్ 19వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్ కే నారాయణ తెరకెక్కిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశాడు యశ్. టాక్సిక్ ఫస్ట్ లుక్‌ను జనవరి 8న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వింటేజ్ టాక్సీ, రౌండప్ క్యాప్ పెట్టుకున్న యశ్ ప్రీ లుక్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార, బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి, తారా సుటారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బ్రదర్-సిస్టర్ కథతో 1970స్ గోవా, కర్ణాటక బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా సాగనుందని ఇన్‌సైడ్ టాక్. కథానుగుణంగా బెంగళూరు, శ్రీలంకలో టాక్సిక్ షూటింగ్ కొనసాగించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ లాంటి గ్లోబల్ బ్లాక్ బస్టర్ ప్రాజెక్టు తర్వాత యశ్ కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.




Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,